


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 16-02-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 138 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### సిట్ బృందానికి మరో ముగ్గురు సభ్యులు

## అదనంగా నియామకం

**సిట్ బృందం అధ్యక్షులు విజయ్ కుమార్**



విశాఖపట్నం: సిట్ బృందానికి అదనంగా మరో ముగ్గురు సభ్యులను ప్రభుత్వం నియమించిందని సిట్ బృందం అధ్యక్షులు విజయ్ కుమార్ వెల్లడించారు.

శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సిట్ బృందం విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెలతో సిట్ బృందం గడువు ముగియడంతో మరో మూడు నెలలు ప్రభుత్వం పెంచినట్లు పేర్కొన్నారు. దర్యాప్తు త్వరితగతిన చేసేందుకు అదనంగా మరో ముగ్గురు సభ్యులను ప్రభుత్వం నియమించినట్లు చెప్పారు. ఇందులో అదనంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఛత్తీసఢ్ కేడరుకు చెందిన కె. దుర్గానంద్ ప్రసాద్ రావు, నగర పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ మీనా, అటవీ శాఖ చీఫ్ కన్జ్వేట్ ఆఫ్ ఫారెస్టు రాహుల్ పాండేలను నియమించినట్లు తెలిపారు. ఏప్రిల్‌తో గడువు ఉందన్నారు. సిట్‌కు మొత్తం 1400 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 400 దర్యాప్తు చేసినట్లు చెప్పారు. ఇంకా 1000 దరఖాస్తులు దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. దర్యాప్తు త్వరితగతిన చేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు అధికారులతో సిట్ బృందం సమీక్షించింది. ఈ సమావేశంలో సిట్ బృందం సభ్యులు వై. వి. అనూరాధ, టి. భాస్కరరావు, జిల్లా కలెక్టర్ వి వినయ్ చంద్, నగర పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ మీనా, జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి సృజన, విఎంఆర్డిఏ కమిషనర్ కోటేశ్వరరావు, సిసిఎజిల్లా అటవీ అధికారి సెల్వం, డిసిపి రంగారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం శ్రీదేవి, ఉప కలెక్టర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర న్యాయశాఖ మంత్రితో

# సీఎం జగన్ భేటీ



న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో శనివారం భేటీ అయ్యారు. 50 నిముషాల పాటు జరిగిన ఈ ముఖాముఖి సమావేశంలో శాసనమండలి రద్దు, కర్నూలుకు హైకోర్టు తరలింపు తదితర అంశాలపై సీఎం జగన్ కేంద్ర మంత్రితో చర్చించారు. సీఎం వైఎస్ జగన్‌తో భేటీ అద్భుతంగా జరిగిందని రవిశంకర్ ప్రసాద్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఇక శుక్రవారం హోంమంత్రి అమిత్‌షాతో సీఎం వైఎస్ జగన్ దాదాపు 40 నిముషాలపాటు సమావేశమైన సంగతి తెలిసిందే. దిశ చట్టరూపం దాల్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, శాసన మండలి రద్దుపై ప్రస్తుత పార్లమెంట్ సెషన్‌లోనే ఆమోదం తెలపాలని ఆయన అమిత్ షాకు విన్నవించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ఐదు పేజీల వినతిపత్రాన్ని అందజేశారు. కాగా, మూడు రోజులు క్రితం ప్రధాని మోదీని కలిసిన సీఎం వైఎస్ జగన్ రాష్ట్రానికి తరువాయి 2లో..

# నెఫ్రాలజిస్టు సేవలు అందాల్సిందే



- డయాలసిస్ యూనిట్ సందర్శన
- 'ఉద్దానం ఆరోగ్యదాయని కావాలి '
- మనసు ఎంతగానో కలచి వేసింది
- రాష్ట్ర ఉపముఖ్య మంత్రి ఆళ్ల నాని

శ్రీకాకుళం: ఉద్దానం కిడ్నీ డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు నెఫ్రాలజిస్టుల సేవలు అందాల్సిందేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) అధికారులను ఆదేశించారు. పలాస సి.హెచ్.సిలో డయాలసిస్ యూనిట్లను రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం, రహదారులు, భవనాల శాఖా మంత్రి ధర్మాన క్రిష్ణ దాస్ లతో కలసి శని వారం పరిశీలించారు. అనంతరం రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు, వైద్య విధాన పరిషత్ కమిషనర్, రాష్ట్ర వైద్య మౌళికసదుపాయల అభివృద్ధి సంస్థ ఎం.డి, ఆసుపత్రి వైద్యులతో మంత్రి సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆల్లా కాళీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడాలని తరువాయి 2లో..

## 22 కిలోమీటర్ల ట్రంప్-మోదీ రోడ్‌షో

**చురుగ్గా కొనసాగుతున్న పనులు**



ఫైల్ ఫోటో..

అహ్మదాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీలు కలసి అహ్మదాబాద్‌లో చేయనున్న రోడ్‌షోకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాదాపు 22 కిలోమీటర్ల పొడవున, 50 వేల మంది ప్రజలు దీనికి హాజరుకానున్నారని అహ్మదాబాద్ మేయర్ బిజాల్ పటేల్ చెప్పారు. ఈ రోడ్‌షో ద్వారా ట్రంప్, మోదీలు సబర్మతీ ఆశ్రమం చేరుకోనున్నారు. మహాత్మాగాంధీకి ఈ ప్రదేశంతో సంబంధాలు ఉన్న సంగతి తెలిసిందే. అనంతరం ఇద్దరూ కలసి మొతెరాలో నిర్మించిన క్రికెట్ స్టేడియాన్ని చేరుకోనున్నారు. 22 కిలోమీటర్ల పొడవున ప్రజలు నిలబడే పెద్ద రోడ్‌షో ఇదే కావచ్చని బిజాల్ పటేల్ చెప్పారు. రోడ్‌షోలో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ప్రజలు తమ సంప్రదాయ ఆహార్యంలో కనిపిస్తారని చెప్పారు. మోదీ, ట్రంప్‌లు కలసి మొతెరాలో బహిరంగ సభలో పాల్గొంటారు.

### యువకులు రక్తదానానికి

## ముందుకు రావాలి

**ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్**



విజయవాడ: రెడ్ క్రాస్ సొసైటీ గిన్నిస్ రికార్డ్ సాధించేందుకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ అన్నారు. ఎనిమిది గంటలు నిర్విరామంగా రక్తదానం కోసం సంతకాల సేకరణ చేపట్టడం శుభపరిణామం అని ఆయన తెలిపారు. లయోలా కళాశాలలోని దేవయ్య మెమోరియల్ ఆడిటోరియంలో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 97 మిలియన్ల వాలంటీర్లను రెడ్ క్రాస్ సంస్థ కలిగి ఉందన్నారు. ఏపీలో 13 జిల్లాల్లో 132 శాఖలు ఉన్నాయి. రాష్ట్రంలో రెడ్ క్రాస్ లక్షా 24 వేల మంది వాలంటీర్లను కలిగి ఉందని ఆయన తెలిపారు. యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. వంద ఏళ్లుగా రెడ్ క్రాస్ సొసైటీ సర్వీస్ చేస్తోందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో పేషేంట్లకు రక్తం అందించే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ రెడ్ క్రాస్ అని గవర్నర్ కొనియాడారు. రక్త దాతల నమోదు ప్రక్రియాలో పాల్గొని విద్యార్థులు ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల నుండి సంతకాల సేకరించి 28 రోజుల్లో రాష్ట్రంలో ఏ రెడ్‌క్రాస్ బ్రాంచ్‌లో అయినా రక్తాన్ని డోనేట్ చేసేలా సొసైటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఎనిమిది గంటల పాటు నిర్విరామంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిన్నిస్ రికార్డులో 30 కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని.. 1500 వందల సభ్యత్వాలు నమోదు చేశారు. దీంతో గిన్నిస్ రికార్డ్ సాధ్యమని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధి తరువాయి 2లో..

## ఏపీ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

**సాంకేతికతలో ఏపీ పోలీసుల ప్రతిభ**

**ఐదు అవార్డులు**

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. ఐదు అరుదైన అవార్డులను పోలీసు తరువాయి 2లో..




### ఆత్మవిమర్శ చేసుకోండి..

## తప్పుడు వార్తలు ప్రచురించొద్దు

**మంత్రి బొత్స బహిరంగ లేఖ**



అమరావతి : తనపై రాసిన తప్పుడు వార్తను ప్రముఖ దినపత్రిక వెనక్కి తీసుకోవాలంటూ పురపాలక శాఖమంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం రామోజీరావుకు లేఖ రాశారు. నాపై తప్పుడు వార్తలు ప్రచురించినందుకు ఆ వార్తను వెనక్కి తీసుకోవాలి. నేను అనని మాటలను మీ అజెండా ప్రకారం మార్చి ప్రచురించారు. చంద్రబాబు పార్టీని బతికించి రక్షించుకోవాలనుకుంటున్న మీ మానసిక స్థితిని ప్రశ్నిస్తున్నా.

అవసరం అయితే ఎన్డీయేలో చేరుతాం అని నేను అన్నట్లుగా మీరు ప్రచురించిన తప్పుడు వార్తను నేను ఎక్కడ అన్నానో చెప్పాలి. అనని మాటలను అన్నట్లుగా మీ పత్రిక మొదటి పేజీలో ప్రచురించి ఎందుకు ఇంతలా దిగజారుతున్నారో ఆత్మ విమర్శ చేసుకోండి. నేను అనని మాటలను అన్నట్లుగా ప్రచురించడంతో మా పార్టీపై నమ్మకం ఉన్న మైనార్టీలను రెచ్చగొట్టాలన్నది మీ దురాలోచన. ఈ వ్యాఖ్యలను మేం చేయలేదని ఖండిస్తే.. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను దెబ్బకొట్టవచ్చన్నది మీ రెండో దురాలోచన. నా వ్యాఖ్యల్ని వక్రీకరించి ప్రచురించిన తీరు మీ దురాలోచనలకు నిదర్శనం. రాష్ట్ర తరువాయి 2లో..

# నేడు రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు

భీమునిపట్నం: తగరపువలస భారత స్వాభిమాన్ ట్రస్ట్, యోగ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖలో ఈనెల 16న రాష్ట్ర స్థాయి యోగా సనాల పోటీలు నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు టి.ఎస్.వి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ వైఎస్సార్ సెంట్రల్ పార్క్ లో ఉదయం 9నుంచి సాయంత్రం 4వరకూ ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి హాజరవు తారని చెప్పారు. 9నుంచి 14 సంవత్సరాల బాలబాలికలు జూనియర్ విభాగంలో ను,15నుంచి 25 సంవ త్సరాల లోపు ఉన్న వారు సీనియర్ విభాగం లోను ఉంటారని అన్నారు. ఒకొక్క విభాగంలో 6గురు టీం ఉంటారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ప్రధమ, ద్వితీయ స్థానంలో గెలుపొందిన విజేతలు జాతీయ స్థాయి కి ఎంపికవుతారని చెప్పారు. మరిన్ని వివరాలకు 63014 13438, 9246 625331 నంబర్లు సంప్రదించాలని ఆయన చెప్పారు.

# ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

## ఘనంగా డేటా ప్రో కంప్యూటర్స్ వార్షికోత్సవం : మంత్రి మల్లాడి

యానాం : యానాం నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ప్రధానమంత్రి కౌశల్యకేంద్రం ద్వారా నిరు ద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ప్లేస్మెంట్లను నిర్వహిస్తున్న డేటా ప్రో కంప్యూటర్స్ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. యానాం సెంటర్ మెనేజర్ మారెళ్ల సూర్యనారాయణ నేత ృత్వంలో నిర్వహించిన కార్యక్రమానికి పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క ృష్ణారావు ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రిమలాడి మాటాడారు. నిరుద్యోగ యవతకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుకున్న ప్రతి ఒక్కరు ప్రభత్వ ఉద్యోగాలు సాదించాలేరు. అందుకే కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులు తముకాళ్ళపైనా తాము నిలబడేలా ఇటువంటి వాటిపై శిక్ష ణా ఇచ్చి వివిద సంస్థల ద్వారా జాబ్ మేళాను నిర్వహిస్తుందన్నారు. వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిదంగా యానాం నియోజకవర్గంలో ప్రభుత్వం, ప్రయివేటు రంగాలలో ఒక పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు అన్ని విధలుగా ప్రయత్నిస్తునట్లు మంత్రి మలాడి తెలిపారు.

అనంతరం సంస్థకు సంబందించిన పలు అంశాలను ప్రతినిధులు వివరించారు. (స్థల సహకారంతో జాబ్ మేళా నిర్వహించారు. కార్యాక్రమంలో సిఐ గూటం శివగణేష్ వివిధ ప్రైయివేటు సంస్థల ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర బీసీ సెల్ కార్యాలయం ఓపెనింగ్ సందర్భంగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసిన 20వ వార్డ్ అధ్యక్షులు పీతల వాసు మరియు వార్డు ముఖ్య నాయకులు

మొదటి పేజీ తరువాయి

## కేంద్ర న్యాయశాఖ మంత్రితో సీఎం జగన్ భేటీ

సంబంధించిన సమస్యలను వివరించిన విషయం విదితమే. ప్రత్యేక హోదాతో పాటు ఏపీకి నిధులు కేటాయింపులోనూ చొరవ చూపించాలని ఆయన ప్రధానిని కోరారు.

## యువకులు రక్తదానానికి ముందుకు రావాలి

రిషి తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు ఎంపీ కేశినేని నాని, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏపీ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

శాఖ సొంతం చేసుకుంది. భువనేశ్వర్ లో ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహించిన టెక్నాలజీ అవార్డ్స్‌లో ఈ అరుదైన గౌరవం దక్కింది. 2020లో సాంకేతిక పరంగా వివిధ అంశాల్లో చూపిన ప్రతిభకు ఏపీ పోలీసు శాఖకు ఐదు బహుమతులు లభించాయి. భువనేశ్వర్ ఐటీ శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డులను ఏపీ పోలీసులు అందుకున్నారు. ఏపీలో విజయవంతంగా పోలీసు వీక్లీ ఆఫ్ విధానం అమలు, దర్యాప్తులో భాగంగా ఇన్వెస్టిగేషన్ ట్రాకర్, ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం, బెస్ట్ ఎలక్ట్రోల్ ప్రాక్టీస్ -ఎస్సీ / ఎస్టీ యాక్ట్ మానిటరింగ్ డ్యాష్ బోర్డు విధానం లో మొత్తం ఐదు అవార్డులు లభించాయి.

## ఆత్మవిమర్శ చేసుకోండి.. తప్పుడు వార్తలు ప్రచురించొద్దు

ప్రయోజనాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తున్న ప్రభుత్వం మాది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉండి... నిధులు తెచ్చుకోవాలని ఏ ప్రభుత్వమైనా కోరుకుటుంది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిశారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చే ఒక్క పథకం లేదు... వల్ల తెలుగు ప్రజలకు జరిగిన మేలు ఫలానా అంటే చెప్పేందుకు ఏమీ మిగల్లేదు. ఎందుకీ పరిస్థితి వచ్చిందో మీరో ఆలోచించుకోండి. చివరిగా.. మీ వార్త తప్పు, మీ ఆలోచన తప్పు. మీ పాలసీ తప్పు. చంద్రబాబును బతికించుకోవడం కోసం మీరు ఎంతటి అసత్యాలు అయినా పత్రికలో ప్రచురించడం తప్పు మాత్రమే కాదు.. నేరం కూడా. మీ స్పందన బట్టి నా తదుపరి కార్యాచరణ ఉంటుంది అని ఆయన పేర్కొన్నారు.

# చిరంజీవి తొలి చిత్రం దర్శకుడు కన్నుమూత



మెగాస్టార్ చిరంజీవి తొలి చిత్రం పునాదిరాళ్ల చిత్ర దర్శకుడు గుడిపాటి రాజ్ కుమార్ శనివారం ఉదయం మృతిచెందారు. ఆయనకు కూడా ఇది మొదటి సినిమా. మొదటి సినిమాకే ఐదు నంది అవార్డులు దక్కించుకున్నారు. అటువంటి దర్శకుడు, నిర్మాత రాజ్ కుమార్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలిసి ఇటీవలే మెగాస్టార్ చిరంజీవి ఆయనకు అపోలో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. ఆ మధ్య ఆయన పెద్ద కుమారుడు కూడా అనారోగ్యంతో మృతి చెందడం, ఆ తర్వాత భార్య చనిపోవడంతో రాజ్ కుమార్ ఒంటరివాడు అయ్యాడు. పైసా సంపాదన లేక అద్దె ఇంట్లో ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న శనివారం ఉదయం మృతిచెందారు. ఆయన స్వగ్రామం విజయవాడ సమీపంలోని ఉయ్యూరు. ఆయన భౌతికకాయాన్ని ఉయ్యూరు కు తీసుకు వెళ్ళేందుకు చిన్న కుమారుడు ఏర్పాట్లు చేస్తున్నారు.

# సత్యదేవుడ్ని దర్శించిన హీరో సాయిధరమ్ తేజ్



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్ని సినిమా హీరో సాయిధరమ్ తేజ్ శుక్రవారం శ్రీ స్వామివార్ని దర్శించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వాదములు అందజేశారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

## - జిల్లా జడ్జి ఎం.బబిత

శ్రీకాకుళం : పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా జడ్జి ఎం.బబిత అంబేద్కర్ విశ్వవిద్యాలయ విద్యార్ధులను కోరారు. శనివారం అంబేద్కర్ విశ్వవిద్యాలయ విద్యార్ధులు జిల్లా కోర్టుకు వచ్చి, జిల్లా జడ్జి ఎం. బబితను కలిసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్ధులు విద్యతో పాటు వివిధ సేవా కార్యక్రమాలలో పాల్గొని, సమాజిక చైతన్యాన్ని కలిగించాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నిషేధం, పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు తదితర ప్రాంతాలలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విశ్వ విద్యాలయ విద్యార్ధులు పాల్గొన్నారు.

# భాష్యం బస్ డ్రైవర్ పై కేసు నమోదు



అనకాపల్లి : మద్యం సేవించి వాహనం నడిపిన భాష్యం స్కూలు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సిఐ బాబ్జీరావు తెలిపారు. పట్టణంలో పలు ప్రాంతాలలో డ్రంక్ & డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో బాష్యం స్కూలుకు చెందిన బస్సులో విద్యార్ధుల్ని తీసుకుని వస్తున్న బస్సును ఆపి డ్రైవర్ కె. నర్సింగరావును పరిక్షలు నిర్వహించగా మద్యం సేవించినట్లు గుర్తించడం జరిగిందన్నారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



పుత్తూరు రూరల్ తిరుమలకుప్పం నందు అన్నపూర్ణ దేవి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ అర్చక కుంభాభిషేకం మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే రోజా

# అన్నవరం రత్నగిరిపై షాపులలో ప్లాస్టిక్ కవర్లు నిషేధం

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపైన గల షాపులు మరియు క్యాంటీన్ నందు ప్లాస్టిక్ కవర్ల విషయమైసివిభాగం సిబ్బంది తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా వారు ప్లాస్టిక్ కవర్లను వినియోగించ రాదని రత్నగిరిపై గల యవన్మంది లైసెన్స్ దారులకు తెలియజేసారు.ప్లాస్టిక్ కవర్లు వినియోగించినట్టు గుర్తించిన యడల రూ.10,000/- వరకు అపరాధ రుసుము విదించబడునని తెలియచేస్తూ అవసరమైన చో తీవ్రతను బట్టి లైసెన్స్ కేన్సిల్ చేయబడునని తెలియజేశారు.

మొదటి పేజీ తరువాయి

# నెఫ్రాలజిస్టు సేవలు అందాల్సిందే



స్పష్టం చేసారు. డయాలసిస్ సేవలు అందిస్తున్న నెఫ్రా ప్లస్ సంస్థ సేవలు మెరుగుపడాలని పేర్కొన్నారు. సంస్థ ద్వారా వచ్చే నెఫ్రాలజిస్ట్ ఏ రోజుల్లో వస్తున్నది తెలియడం లేదని, వచ్చినప్పటికి ఆసుపత్రిలో ఉన్న కొద్ది మందిని పరీక్షించి వెళుతున్నారని ఆరోపణలు ఉన్నాయని మంత్రి పేర్కొంటూ వీటిని తక్షణం సరిదిద్దాలని ఆదేశించారు. నెఫ్రా ప్లస్ సంస్థ ప్రధాన అధికారి సమావేశానికి హాజరు కాకపోవడం పట్ల మంత్రి ప్రశ్నించారు. నెఫ్రాలజిస్ట్ వచ్చే రోజులు నిర్దిష్టంగా ఉండాలని ఆదేశించారు. ఏ రోజుల్లో వస్తున్నది ముందుగా తెలియజేయాలని, సేవలలో లోపం ఉండరాదని స్పష్టం చేసారు. నెల రోజుల్లో మరో నెఫ్రాలజిస్ట్ సేవలు ఉపయోగించుటకు చర్యలు తీసుకుంటామని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. డయాలసిస్ చేసుకుంటున్నవారికి స్థానికంగా మందులు అందించుటకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ అధ్యక్షుడు పిరియా సాయిరాజ్, జిల్లా కలెక్టర్ జె నివాస్, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డా కె.వెంకటేష్, రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా రామకృష్ణా రావు, ఏపిఎంఐడిసి ఎం.డి చంద్రశేఖర రెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా ఏ.కృష్ణ వేణి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కె.కృష్ణ మూర్తి, డిఎంహెచ్ఓ డా ఎం.చెంచయ్య, డిసిహెచ్ఎస్ డా బి.సూర్యారావు, డా వై.వి.కామేశ్వర ప్రసాద్, డా లీలా, అర్డబ్ల్యూఎస్ ఎస్ఇ టి.శ్రీనివాసరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి ఐ.కిషోర్., డా కిల్లి కృపారాణి, దువ్వాడ శ్రీనివాస్, దువ్వాడ శ్రీకాంత్, మామిడి శ్రీకాంత్ తదితర అధికార అనధికారులు పాల్గొన్నారు.

### 'ఉద్దానం ఆరోగ్యదాయని కావాలి ' రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం

ఉద్దానం ప్రాంతం ఆరోగ్యదాయని కావాలని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం ఆకాంక్షించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్లా కాళీ కృష్ణ శ్రీనివాస్ పర్యటనలో భాగంగా పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో డయాలసిస్ స్థితిలో ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శాసన సభాపతి సీతారాం పాల్గొని మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి ప్రాణాంతకంగా ఉద్దానంను వెంటాడుతోంది అన్నారు. దీనిని తరిమికొట్టాలి అనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని చెప్పారు. పాదయాత్రలో చూసిన, విన్న సమస్యలను పరిష్కరించుటకు నడుం బిగించారని తెలిపారు. కిడ్నీ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు గొప్ప మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలాస శాసన సభ్యులు డా.సీదిరి అప్పలరాజు, పాలకొండ శాసన సభ్యులు విశ్వసరాయి కళావతి, డీసీఎంఎస్ అధ్యక్షులు పిరియా సాయిరాజ్, జిల్లా కలెక్టర్ జె నివాస్, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డా కె.వెంకటేష్, రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా రామకృష్ణా రావు, ఏపిఎంఐడిసి ఎం.డి చంద్రశేఖర రెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా ఏ.కృష్ణ వేణి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కె.కృష్ణ మూర్తి, డిఎంహెచ్ఓ డా ఎం.చెంచయ్య, డిసిహెచ్ఎస్ డా బి.సూర్యారావు, డా వై.వి.కామేశ్వర ప్రసాద్, డా లీలా, అర్డబ్ల్యూఎస్ ఎస్ఇ టి.శ్రీనివాసరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి ఐ.కిషోర్., డా కిల్లి కృపారాణి, దువ్వాడ శ్రీనివాస్, దువ్వాడ శ్రీకాంత్, మామిడి శ్రీకాంత్ తదితర అధికార అనధికారులు పాల్గొన్నారు.

### మనసు కలచి వేసింది

ఉద్దానం ప్రాంతం పర్యటన, కిడ్నీ డయాలసిస్ వ్యాధిగ్రస్తులతో ముఖాముఖి మనసు కలచివేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆల్లా కాళీ కృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం పలాస ప్రాంతంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఉపముఖ్య మంత్రి బొడ్డపాడులో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. డయాలసిస్ వ్యాధిగ్రస్తుల మాటలు వింటే మనసుకలచివేసిందన్నారు. ఎక్కువ మంది కిడ్నీ భారీన పడటం, మరణించడంతో కుటుంబాలు చిన్నాభిన్నమౌతున్నాయని పేర్కొన్నారు. ఉద్దానం ప్రాంత వాసుల్లో ఆత్మస్థైర్యం, విశ్వాసం, ధైర్యం నింపాల్సిన అవసరం ఉందన్నారు. కిడ్నీ వ్యాధిని తరిమికొట్టుటకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్య మంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఉద్దానం ప్రాంతంపై ప్రత్యేక దృష్టితో ఉన్నారని చెప్పరు. ఈ రంగంలో నిపుణులైన వైద్యులతో పరిశోధనలు చేయించుటకు చర్యలు చేపడుతున్నారని అన్నారు. డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు ప్రస్తుతం లభిస్తున్న సేవలను మరింత విస్తృతపరచుటకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. కిడ్నీ వ్యాధిని శాశ్వతంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి జగన్ ఆశయమని, అందుకే వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు, ఆసుపత్రుల్లో సౌకర్యాలు, వివిధ పరిస్థితులను గమనించాలని ముఖ్య మంత్రి ఆదేశించారని చెప్పారు. కిడ్నీ వ్యాధికి శాశ్వత పరిష్కారం లభించాలని అందుకు నిపుణులైన వైద్యులతో అన్ని స్థాయిల్లో పరిశోధనలు చేయించుటకు కిడ్నీ పరిశోధక కేంద్రాన్ని పలాసలో ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఇచ్చాపురం, పలాస నియోజకవర్గంలో 7 మండలాల్లో 5 లక్షల మందికి శుద్ధ నీటి జలాలు అందించుటకు రూ.7 వందల కోట్లతో చర్యలు చేపట్టామన్నారు. ఇంటింటికి కొలాయి కార్యక్రమం రాష్ట్రంలో ఇతర జిల్లాలలకు మంజూరు చేసినప్పటికి ఉద్దానంలో త్వరగా పూర్తి చేయుటకు ఇతర జిల్లాల్లో పనులు నిలుపుదల చేసామన్నారు. హిరమండలం రిజర్వాయర్ నీటిని ఉపయోగించి తాగునీటి సరఫరా చేయుటకు చర్యలు చేపట్టడం జరిగిందని, సంవత్సరం ఆరు నెలల్లో ఇంటింటికి తాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిని పూర్తిగా నిర్మూలనకు కృషి చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని మంత్రి కోరారు. దూర ప్రాంతాలకు వెళ్ళి డయాలసిస్ చేసుకునే వారికి బస్ పాస్ సౌకర్యం కల్పించుట జరుగుతుందని మంత్రి చెప్పారు.

### ఆరోగ్య కార్డుల పంపిణీ

రాష్ట్రంలో ఆరోగ్య కార్డుల పంపిణీ ప్రక్రియ శని వారం ప్రారంభం జరిగిందని చెప్పారు. క్యూ ఆర్ కోడ్ తో పివిసి కార్డులను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 1.41 కోట్ల ఆరోగ్య కార్డులు జారీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారం, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్, డా.సీదిరి అప్పలరాజు, పాలకొండ శాసన సభ్యులు విశ్వసరాయి కళావతి, డీసీఎంఎస్ అధ్యక్షులు పిరియా సాయిరాజ్, జిల్లా కలెక్టర్ జె నివాస్, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డా కె.వెంకటేష్, రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా రామకృష్ణా రావు, ఏపిఎంఐడిసి ఎం.డి చంద్రశేఖర రెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా ఏ.కృష్ణ వేణి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కె.కృష్ణ మూర్తి, డిఎంహెచ్ఓ డా ఎం.చెంచయ్య, డిసిహెచ్ఎస్ డా బి.సూర్యారావు, డా వై.వి.కామేశ్వర ప్రసాద్, డా లీలా, అర్డబ్ల్యూఎస్ ఎస్ఇ టి.శ్రీనివాసరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి ఐ.కిషోర్., డా కిల్లి కృపారాణి, దువ్వాడ శ్రీనివాస్, దువ్వాడ శ్రీకాంత్, మామిడి శ్రీకాంత్ తదితర అధికార అనధికారులు పాల్గొన్నారు.



## అప్పన్నను దర్శించుకున్న సినీ నటుడు సాయిదర్మతేజ



సింహాచలం: సింహాద్రిపై కొలువు తీరివున్న వరాహా లక్ష్మీనారసింహ స్వామివారిని సినీ నటుడు సుప్రీమ్ హీరో సాయిదర్మతేజ శనివారం

నాడు దర్శించుకున్నారు చేరుకున్న వీరికి అలయ ఏఈఓ పులి రామారావు మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలకగా తొలుత కప్పస్థంభం ఆలింగనం చేసుకోగా స్వామివారికి తమగోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనాంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అలయ ఉప కార్యనిర్వాహణాధికారి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్ధప్రసాదలు అందజేశారు.

## బీజేపి అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా 17న సిపిఐ, సీపీఎం ధర్నాను జయప్రదం చేయండి




విశాఖపట్నంః భారత దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ధిక వ్యవస్థతో పాటు అనేక ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేస్తూ భారత దేశాన్ని తెగనమ్ముతున్నారని సిపిఐ, సీపీఎం నేతలు ఆరోపించారు. శనివారం ఉదయం డి.ఎన్.ఆర్. అమర్ భవన్ (సిపిఐ జిల్లా కార్యాలయంలో) ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణలు మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు కాసుల వర్షం కురిపించే విధంగా సామాన్య ప్రజలకు పూర్తిగా నిరాశ కలిగించిందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు ప్రస్తావనే లేకుండా తీవ్రమైన ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ష అండ్ కో వాళ్ళు రిలయన్స్ సంస్థ దగ్గర జీతగాళ్ళగానే పనిచేస్తు ఆర్ధిక నెరగాళ్లకు మాత్రమే చౌకిదార్ ఉంటూ దేశంలో ఉన్న ప్రజాసమస్యలను గాలికొదిలేసి మతాల పేరుతో దేశాన్ని విడగొట్టి అల్లకల్లోలాలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపద్యంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా, ఆర్ధిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 17వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోజు ధర్నా కార్యక్రమంలో ప్రజలందరు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. కృష్ణంరాజు, జిల్లా సమితి సభ్యులు ఎస్.రంగరాజు, టి.జీవన్, సిపిఐ (ఎం) పట్టణ కార్యదర్శి రెడ్డి శంకరరావులు పాల్గొన్నారు.

# గీతంలో విదేశీ విద్యార్ధుల ఉత్సవం



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల అభ్యసిస్తున్న విదేశీ విద్యార్ధులు బృందంగా ఏర్పడి "సయుక్త " పేరిట ప్రత్యేక ఉత్సవాన్ని మార్చి 7వ తేదీన నిర్వహించనున్నారు. దీనికి సంబందించిన కార్యక్రమాల గోడ పత్రికను శనివారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ ఆవిష్కరించారు. గీతంపై నమ్మకంతో ఆఫ్ఘనిస్థాన్, నేపాల్, భూటాన్, నైజేరియా, తైవాన్, ఘన, సిరియా, ఇథియోపియా, ఉగాండ దేశాలకు చెందిన విద్యార్ధులు ప్రవేశాలు పొందారని గీతం అంతర్జాతీయ విద్యార్ధి విభాగం డైరక్టర్ కె.పి.కిషన్ తెలిపారు.

ప్రపంచ శాంతిని కోరుతూ అంతర్జాతీయ విద్యార్ధులు స్థానికి బీచ్ రోడ్డులో శాంతి ర్యాలీ చేయడంతో పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

వికలాంగులైన బాలబాలికల సహయార్ధం సంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి విరాళాలు సేకరించనున్నారు. విద్యార్ధుల ప్రయత్నాన్ని వౌస్‌ఛాన్సలర్ కె.శివరామకృష్ణ అభినందించారు.

# పరీక్షల విభాగం పరిశీలన

### ఇంచార్జి రిజిస్ట్రార్, అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు



ఆంధ్ర విశ్వకళాపరిషత్ః ఆంధ్రశ్వవిద్యాలయం పరీక్షల విభాగాన్ని ఇంచార్జి రిజిస్ట్రార్, అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు శనివారం ఉదయం పరిశీలించారు. పరీక్షల విభాగాలలో ఉద్యోగుల హాజరు, విద్యార్ధులకు అందిస్తున్న సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావాలని, విద్యార్ధులకు సత్వర సేవలు అందించాలని సూచించారు.

విధినిర్వహణలో అలక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్ధులకు ప్రధమ ప్రాధాన్యత కల్పించాలన్నారు. విద్యార్ధులకు వర్సిటీ పరంగా అందించే సేవలను సమర్ధవంతంగా, వేగవంతంగా అందించాలని సూచించారు. ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.వి సుధాకర రెడ్డి, జె.ఆదిలక్ష్మిలు పాల్గొన్నారు.

మద్యాహ్నం పరిపాలనా కార్యాలయంలోని సిడిసి, కంప్యూటర్ సెంటర్, ట్రాన్స్‌పోర్ట్ సెక్షన్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. బోధనేతర సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అకారణంగా విధులకు గైర్హాజరైన వారిని గుర్తించి వారిపై చర్యలకు సిఫారసు చేశారు. ఉద్యోగులు కార్యాలయ పనివేళల్లో విధుల్లో ఉండాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రిజిస్ట్రార్ వెంట డి.ఆర్ ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాష్, ఎస్ 3 సూపరిండెంట్ శ్రీనివాస రెడ్డి తదితరులు ఉన్నారు.

## 18, 19 తేదీల్లో స.హ.చట్టం మహాసభలు

గొలుగొండః ఈ నెల 18, 19 తేదీల్లో విజయవాడ రైల్వే కళాక్షేత్రలో ప్రజాస్వామ్య పరిరక్షణ సంఘ సమాచార హక్కు చట్టం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నారని జిల్లా సమాచార హక్కు చట్టం అధ్యక్షులు సింహాద్రి రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభకు రాష్ట్ర అధ్యక్షులు కెవిఎస్.నారాయణ పిలుపుమేరకు ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి నూతనంగా ఏర్పాటు చేసిన సంఘ సభ్యులతో పాటు జిల్లాలోని పలువురు హాజరు కానున్నారన్నారు. సమావేశానికి ఇటీవల జిల్లాలో నిర్మించిన అధ్యక్ష కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులు హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

### నేడు తూర్పుకాపు సంక్షేమ సంఘం

## విస్తృత స్థాయి సమావేశం

సింహాచలం : విశాఖపట్నం జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం నేటి సాయంత్రం 3 గం. లకు సింహాచలం ప్రియగార్డన్స్ స్వామి కళ్యాణమండపం లో జరుగునని కావున తూర్పుకాపు సాంఘియులు హాజరై .కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ ఎన్ని బాస్కారరావు శక్రటరీ లొగిశ గణేష్. తెలిపారు.

## పీఎం పాలెం పోలీస్ స్టేషన్లో ఆక్రమణదారులపై ఫిర్యాదు



మధురవాడ : మహా విశాఖ ఐదవ వార్డు పరిధి మధురవాడ సర్వేనెంబర్ 296/6 లో జరుగుతున్న ఆక్రమణలపై ఎట్టకేలకు రెవిన్యూ అధికారులు స్పందించారు,

విశాఖ రూరల్ తాసిల్దార్ నరసింహమూర్తి ఆదేశాల మేరకు పీఎం పాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు, ఈ ప్రభుత్వ భూమిని తాళ్లపూడి రామప్పాడు ఆక్రమించినట్లు కనుగొన్నారు. పది రోజుల క్రితం పెట్టిన హెచ్చరిక బోర్డును తొలిగించడం పై తాళ్లపూడి రామప్పాడు పై రెవెన్యూ అధికారులు కేసు పెట్టారు.

ఈ విషయమై భూ ఆక్రమణ చట్టం కింద నిందితుడు పై శనివారం సాయంత్రం వి ఆర్ ఓ అప్పారావు పిఎం పాలెం పోలీస్ స్టేషన్ లో సీఐ రవికుమార్ కి పిర్యాదు చేశారు.

# కేంద్ర బడ్జెట్‌లో పేదలకు అన్యాయం




నర్సీపట్నంః కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు తీవ్ర అన్యాయం చేసిందని నిరశిస్తూ సిపిఐ, సిపిఎం నాయకులు శనివారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.రామునాయుడు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ అవసరాలకు ఆదాయాన్ని సమకూర్చే ప్రభుత్వ రంగలకు బడ్జెట్‌లో ఏ మాత్రం కేటాయింపులు జరగలేదన్నారు. ప్రజలను కార్మికులను దోచుకునే పెట్టుబడిదార్లకు భారీగా ఆదాయాన్ని సమకూర్చేలా బడ్జెట్ తయారు చేశారన్నారు. పెట్టుబడిదర్లకు అతిగా ఆదాయాన్ని ఇచ్చే కంపెనీలకు పన్ను రాయితీ ఇచ్చారన్నారు. విమానం, టెలికాం, ఎల్‌ఐసి, బ్యాంకింగ్ రంగాలను వాటి వాటా అమ్మేసి ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగాలను అమ్మేయడం ప్రభుత్వానికి ఆదాయం ఉండదన్నారు. ఫలితంగా పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాలు, నీటి ప్రాజెక్టులు కుంటుపడతాయన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోగా పోలవరం, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించలేదన్నారు. ఉత్తరాంధ్రకు ఇస్తానన్న రైల్వేజోన్, కెమికల్ యూనివర్శిటీ, గిరిజన యూనివర్శిటీలు కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సాపిరెడ్డి నారాయణ మూర్తి, ఐద్వా నాయకులు సూర్యప్రభ, నాయకులు రమణ, వెంకటస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుబాబు, నూకినాయుడు, రాధాకృష్ణ, రాజబాబు, పలువురు వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

## బైద్యనాథ్ ఆలయాన్ని సందర్శించిన
# శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి



విశాఖపట్నం : విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారి ఆదేశాలతో పీఠం ఉత్తరాధికారి స్వామి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి హిమాలయాల్లో చేపట్టిన పర్యటన కొనసాగుతోంది.

హిమాలయ పర్వత సానువుల్లో పర్యటించి స్వాత్మానందేంద్ర శనివారం ధర్మశాలకు సమీపంలోని పరమేశ్వరుని ఆలయాన్ని సందర్శించారు. వేకువజామున ఆలయానికి వెళ్ళి జపమాచరించారు. పరమేశ్వరుని సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసారు. ఈ ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. పరమేశ్వరుడిని మెప్పించడం కోసం రావణాసురుడు ఇక్కడే వెయ్యి సంవత్సరాల పాటు తపస్సు చేశాడని స్థల పురాణం చెప్పుతుంది.



*అరబిందో పరిశ్రమలో యాజమాన్యం అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని,వేధింపులు, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరుతూ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.వి.ఎన్.సుబ్రమణ్యం గారికి విశాఖపట్నంలో సీఐటీయూ ప్రతినిధి బృందం, లంకలపల్లి. రాంబాబు,లెంక. గంగరాజు కుటుంబ సభ్యులతో కలిసి వినపత్రాన్ని అందజేసారు.*

## భార్య భర్తల ఘర్షణలో భార్య సరోజిని మృతి



సబ్బవరం: మండలంలోని అమృతపురం గ్రామంలో భార్యాభర్తల ఘర్షణలో సరోజిని మృతి చెందింది. భర్త కాలాంతకుడు అయితే ఎలా? భరించేవాడు భర్త అంటారు. వివరాల్లోకి వెళితే రాత్రి 11 గంటలకు భార్యాభర్తల ఇరువురు ఘర్షణ పడినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తైనాన శ్రీనివాసరావు తన భార్య సరోజిని కత్తితో పీకపై నరికినట్లు సమాచారం అందించగా సబ్బవరం సిఐ చంద్రశేఖర రావు, ఎస్సై దీనబంధు సిబ్బంది అర్ కే నాయుడు అమృత పురం గ్రామానికి చేరుకొని సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తైనాన శ్రీనివాసరావు ( 45). తైనాన సరోజిని ( 40) వీరు వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. వీరికి ముగ్గురు పిల్లలు. వీరు కొమ్మాదిలోని శ్రీ చైతన్య పాఠశాల చదువుతున్నారు.

## సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయండి



గొలుగొండ : గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని మండల ప్రత్యేకాధికారి గోపిమోహన్ తెలిపారు. ఆయన చోద్యం గ్రామ సచివాలయంను సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఇటీవల కొన్ని కారణాల వలన తొలగిన పింఛన్లు వెంటనే పరిశీలించి అర్హత ఉన్న వారికి మంజూరుకు గ్రామసభలు నిర్వహించాలని కోరారు. పింఛన్లపై లబ్ధిదారులు ఆందోళన చెంద కూడదని అర్హత ఉన్న వారికి వెంటనే మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో రోడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్



విశాఖపట్నం: జిల్లాలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి రోడ్ల నిర్మాణం పైనే ఆధారపడి ఉంటుందన్నారు. విద్య, వైద్య సదుపాయాలు అందరికీ అందాలంటే అన్ని ప్రాంతాలకు రోడ్లు విస్తరించి ఉండాలన్నారు. పి ఎం జి ఎస్ వై, ఆర్ సి పి ఎల్ పథకాలలో 205 రోడ్లు మంజూరయ్యాయని, వాటిలో 70 రోడ్లు పూర్తిగా కాగా, 106 రోడ్లు పనులు జరుగుతున్నాయన్నారు. వివిధ దశల్లో ఉన్న రోడ్డు పనులను గురించి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఫారెస్ట్ అనుమతులు లేనందున పనులు సాగడం లేదని, దీనిపై సవివరమైన రిపోర్టును సమర్పించ వలసిందిగా ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతంలో మే నెల నుండి వర్షాలు మొదలవుతాయని కాబట్టి మార్చి, ఏప్రిల్ నెలల్లోగా పనులన్నీ పూర్తి చేయాలన్నారు. పనులు మంజూరై నిధులు కూడా విడుదల అయినందున ఎటువంటి జాప్యం చేయకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి గిరిజన ప్రాంతంలో అన్ని సౌకర్యాలు కలుగజేయాలని ఆదేశాలు జారీ చేశారని, సరుకు రవాణా ఇళ్ల నిర్మాణం మొదలైన వాటన్నింటికీ రోడ్డు నిర్మాణాలు ఆవశ్యకమని చెప్పారు.

ఈ సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి డీకే బాలాజీ, డివిజనల్ అటవీ శాఖ అధికారులు లక్ష్మణ్, వినోద్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ జి సుధాకర్ రెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్ లు ఎస్. సంపత్ కుమార్ కే శ్రీనివాస్, ఆర్ కె భాస్కర్, డివిజనల్ ఇంజనీర్ లు ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## రాజకీయంలో నేరచరితలు

ప్రజాప్రతినిధుల అక్రమాలు, అవినీతి ఆరోపణలపై సుప్రీంకోర్టు ఇదివరకే అనేక చరిత్రాత్మక తీర్పులిచ్చింది. విచారణ సత్వరమే చేపట్టాలనీ, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో విచారణ పూర్తిచేయాలని, శిక్షలు పడినవారిని అనర్హులుగా ప్రకటించాలని గతంలోనే ప్రకటించింది. అయినా వాటితో మన రాజకీయాల్లో గుణాత్మక మార్పు సంభవించిన దాఖలాలు కనిపించటం లేదు. తాజా తీర్పును కూడా అధికార పార్టీతో సహా అన్ని రాజకీయపక్షాలూ ఆహ్వానించటం హర్షణీయం. అయితే నేరచరితులను అరికట్టే క్రమంలో రాజకీయ వేధింపులకు గురైనవారిని వెలివేసే పరిస్థితి ఉండకూడదు. చట్టసభల్లో నేరచరితుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్న తీరు పట్ల సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నవారిని ఎన్నికల్లో అభ్యర్థులుగా ఎందుకు నిర్ణయించారో వివరణ ఇవ్వటంతో పాటు, ఆయా కేసుల జాబితాను రాజకీయ పార్టీలన్నీ తమ వెబ్‌సైట్లలో ఉంచాలని స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలన్నీ అభ్యర్థులను ఎంపిక చేసిన 48 గంటల్లోగా లేదా, నామినేషన్ల దాఖలు ప్రారంభమయ్యే తేదీకి కనీసం రెండు వారాల ముందు అభ్యర్థుల నేర చరిత్రను ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి అన్ని సోషల్‌మీడియా వేదికలపై వెల్లడించాలని ఆదేశించింది. నేర వివరాలన్నీ జాతీయ, స్థానిక వార్తా పత్రికల్లోనూ ప్రకటనలుగా జారీచేయాలని చెప్పింది. అంతేకాకుండా ఈ ఆదేశాలను పాటిస్తున్నట్లు అన్ని రాజకీయ పక్షాలు ఎన్నికల కమిషన్‌కు లిఖితపూర్వకంగా తెలుపాలని ఆదేశించటం గమనార్హం. అభ్యర్థులను ఎంపికచేసిన మూడు రోజుల్లోగా ఈ పని పూర్తిచేయాలని కూడా ఆదేశించటం నేర రాజకీయాల పట్ల సుప్రీంకోర్టు ఎంత తీవ్రంగా ఆలోచిస్తున్నదో తెలుపుతున్నది. ఎన్నికల్లో గెలుస్తారన్న ఒకేఒక్క కారణంతో నేరచరితులకు టిక్కెట్లు ఇచ్చామని పార్టీలు చెప్పటం సరికాదు, వారి అర్హతలు, సమర్థత వంటి అంశాలను ప్రస్తావిస్తూ తగిన కారణాలు చూపాలని జస్టిస్ ఆర్.ఎఫ్. నారిమన్, జస్టిస్ రవీంద్రభట్‌ల బెంచ్ స్పష్టం చేయటం గమనించదగినది. రాజకీయాలు నేరపూరితం కావటంపై 2018 సెప్టెంబర్‌లో కోర్టు ఇచ్చిన తీర్పు అమలు కావటం లేదని, ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని దాఖలైన పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టిన సందర్భంగా ఈ విధంగా ఆదేశాలివ్వటం ఆహ్వానించదగిన పరిణామం. గత రెండు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల వ్యవస్థను శాసిస్తున్న అంగబలం, అర్థబలాలు ప్రజాస్వామ్యానికి పెనుసవాళ్లు విసురుతున్నాయి. అవినీతికి రాజకీయం పర్యాయపదంగా మారిపోయింది. రాజకీయ పార్టీలకూ, ఆ పార్టీ తరపు న పోటీ చేస్తున్న అభ్యర్థులకూ రాజకీయ విధానాలు, అమలు చేయదల్చిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాల వాగ్దానాలు ప్రచారాస్త్రాలుగా ఉండటం లేదు. కులం, వర్గం పునాదిగా ధనబలమే నిర్ణయాత్మకశక్తిగా ఉంటున్నది. వారి నేపథ్యం ఎటువంటిదైనా గెలిచే అభ్యర్థులనే పార్టీలు బరిలో నిలుపుతున్నాయి. ఈ క్రమంలోనే ఏటా ఎన్నికల బరిలో నేరచరితుల సంఖ్య పెరిగిపోతున్నది. 2009లో 15వ లోక్‌సభలో 30 శాతం మంది నేరచరిత్ర కలిగి ఉన్నారు. 2014 నాటికి అది 34 శాతానికి పెరిగింది. ఓ పదేండ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, 2009 నుంచి 2019 వచ్చేనాటికి ప్రజాప్రతినిధుల్లో నేరచరిత్ర కలిగినవారు 109 శాతా నికి పెరిగారు. ప్రస్తుత పార్లమెంట్‌లో ఉన్న 43 శాతం ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయని తెలుస్తున్నది. ఇందులో కిడ్నాప్‌లు, హత్యలు, దోపిడీలు, అత్యాచారాల వంటి తీవ్ర నేరాల్లో విచారణ ఎదుర్కొంటున్న వారు 20 శాతానికి పైగా ఉన్నారంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉన్నదో అర్థమవుతున్నది. ఇదంతా అభ్యర్థులు ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు తమ అఫిడవిట్లలో స్వచ్ఛందంగా తెలిపిన సమాచారమే. నేరమయ రాజకీయాలకు వ్యతిరేకంగా అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) లాంటి సంస్థ చేస్తున్న పోరాటానికి తోడు, కొన్ని స్వచ్ఛంద, పౌరసంఘాలు చేపడుతున్న చైతన్య కార్యక్రమాలు మంచి ఫలితాలనిస్తున్నాయి. సందర్భానుసారంగా కోర్టులు తగురీతిన స్పందిస్తూ రాజకీయాల ప్రక్షాళనకు నడుంకట్టడం ముదావహం.

## సాహిత్య విమర్శకుడు నార్ల వెంకటేశ్వరరావు వర్ధంతి (ఫిబ్రవరి 16)




అసాధారణ మేధావి, అగ్రశ్రేణి పత్రికా సంపాదకుడు, సాహిత్య విమర్శకులు, రాజ్యసభ సభ్యులు, ప్రజాస్వామ్య ప్రియులు నార్ల వెంకటేశ్వర రావు డిసెంబర్1, 1908 న జబల్ పూర్ లో జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మణ రావు, మహా లక్ష్మమ్మ. వెంకటేశ్వర రావు 1928 లో గుంటూరు హిందూ కళాశాల హై స్కూల్ లో ఎస్ ఎస్ ఎల్ సి పూర్తి చేశారు. నార్ల వారిపై అప్పటికే బ్రహ్మ సమాజం ప్రభావం పడింది. కాకినాడ పిఠాపురం రాజా వారి కళాశాల లో ఇంటర్ లో చేరినప్పుడు ఆ బావాలు బాగా బలపడ్డాయి. విగ్రహారాధనను మాని మానవతావాదిగా మారారు. సామాన్య మానవుల స్థితిగతులను మెరుగుపరచడానికి 'సోదర సమితి' అనే సమైఖ్యను ఏర్పాటు చేశారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో తుఫాన్ కు గురైన ప్రజలకు దన, వస్త్రాలను వసూలు చేయడంలో సహాయపడ్డారు. సాంఘిక, రాజకీయ కారణాల వల్ల వీరి చదువు సరిగా సాగలేదు. 1928 కి పూర్వం మద్రాసు సమావేశ పునః పరిశీలన కలకత్తా లో కాంగ్రెస్ పార్టీ చేయగా దానిపై ఆగ్రహంతో మద్దూరి అన్నపూర్ణమ్మ రాసిన వ్యక్తిగత లేఖను వారు కాంగ్రెస్ పత్రికలో వ్యాస రూపంలో ప్రచురించారు. అదే వారి అచ్చయిన మొదటి రచన. 1933లో బి ఏ చదివే రోజుల్లో మొదటి గ్రంథం స్వదేశీ సంస్థానాలు ప్రకటించారు. స్వదేశీ సంస్థానాలలో ప్రజల కష్ట సుఖాలను ఇందులో వివరించగా ముట్నూరి కృష్ణారావు కృష్ణా పత్రికలో మెచ్చుకుంటూ సమీక్షిస్తూ సంపాదకీయం రాయడంతో ఈ గ్రంథానికి అనన్య ప్రచార మొచ్చింది. అయితే నిజాం, మైసూర్, తిరువాంకూర్ సంస్థానాలు బహిష్కరించారు. డా. పట్టాభి వారి జన్మభూమి, లాహోర్ నుంచి వెలువడే పీపుల్స్, పూనా నుంచి వెలువడే మహారాటీ పత్రికలకు ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా పనిచేసారు. జనవాణి, ప్రజామిత్ర మొదలైన పత్రికలలో కొంతకాలం పనిచేశారు. ఆంధ్రజ్యోతి దిన పత్రికకు తొలి సంపాదకులు (1960-77) వీరే. ఆంధ్రప్రభ దినపత్రిక కు 1942-59 మద్య సంపాదకత్వం వహించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కు ఆ పేరు సూచించింది నాడు ఆంధ్రప్రభ ఎడిటరైన నార్ల వారే అంటారు. మాటామంతీ, ఆషామాషీ మొదలైన రచనలతో పాటు 'నవయుగాల బాట నార్ల మాట' , 'వాస్తవమ్ము నార్ల మాట' అనే మకుటాలతో పద్యాలు రాశారు. రాజ్య సభ సభ్యులుగా కూడా పనిచేశారు. భారతీయ సాహిత్య నిర్మాతలు అన్న శీర్షిక క్రింద కేంద్ర సాహిత్య అకాడమీ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ భాష యైన ఆంగ్లంలో వీరేశలింగం, వేమన, గురజాడ ల పై నార్ల వారిచే గ్రంథాలు ప్రచురించారు. అవి భారతీయ భాషలన్నింటిలోకి అనువదించారు. 1969 లో తెలంగాణ ఉద్యమంలో, 1972 లో జై ఆంధ్రా ఉద్యమంలో రాష్ట్ర సమైక్యతకు పాటు పడ్డారు. 1973 సెప్టెంబర్ 29 న గవర్నర్ ఖండుభాయి దేశాయి గారి ఆంధ్ర విశ్వ కళా పరిషత్ ద్వారా డాక్టరేట్ ఆఫ్ శ్రీవ్వతీం గౌరవ బిరుదును స్వీకరించారు.

1975 లో శ్రీ వేంకటేశ్వర విద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా పొందారు. 1974 లోనే సంప్రదాయ వ్యతిరేకమైన సనాతన వ్యాఖ్యతో, విపుల పీఠికతో జాబిలి అనే నాటికను ప్రచురించ గా తీవ్ర వాదోపా వాదాలకు దారి తీసింది. మాటా మంతీ, పిచ్చా పాటీ లను కలిపి కొత్త పాత పేరుతో కొన్ని వ్యాసాలు జోడించి, కదంభం ను పునర్ముద్రించారు. సాహిత్య అకాడమీ పక్షాన గురజాడ వారి కన్యాశుల్కంను 1975లో కుదింపు చేశారు. వీరు 1985 ఫిబ్రవరి 16న మరణించారు

## మహాశివరాత్రికి విశేష పూజలకు ఏర్పాట్లు

సబ్బవరం : మండలంలోని గొర్లివానిపాలెం గ్రామంలోని శ్రీ ఉమా రామలింగేశ్వర, శ్రీ లక్ష్మీ సత్యనారాయణ మూర్తి, శ్రీ కోదండ సీతారామస్వామి వార్ల దేవస్థానంలో ఈనెల 21వ తేదీ శుక్రవారం రాత్రి 8.30 గంటలకు 43వ కళ్యాణ వార్షికోత్సవం, అలాగే తులసి, కుంకుమ బిల్వపత్ర పూజ మహోత్సవం, విశేష పూజలు నిర్వహించబడును అని ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చంనాయుడు, మాజీ ఎంపీపీ గొర్లి ఉమామహేశ్వరరావు శనివారం విలేకరులకు తెలిపారు .19న బుధవారం ఉదయం 9 గంటలకు సంకల్పం ,విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన , నవగ్రహారాధన, ధ్వజారోహణ , అగ్ని ప్రతిష్ట , అంకురార్పణ, అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు భక్తులచే లక్ష తులసి పూజా కార్యక్రమం జరుపబడును అని తెలిపారు. 20వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు వేద పారాయణ, నవగ్రహపూజా కార్యక్రమాలు, విశేష హోమ కార్యక్రమములు , జరుపబడును. మధ్యాహ్నం మూడు గంటలకి మహిళలచే లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించబడును అని తెలిపారు. 21న శుక్రవారం ఉదయం నాలుగు గంటల నుండి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల యొక్క గోత్రనామాలతో అభిషేకములు, ప్రత్యేక పూజలు నిర్వహించబడును, ఉదయం తొమ్మిది గంటలకి నవగ్రహ పూజా కార్యక్రమాలు, విశేష హోమ కార్యక్రమములు , మూలమంత్ర హోమములు జరుపబడును. అదే రోజు రాత్రి 8 30 గంటలకు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ సత్యనారాయణమూర్తి, శ్రీ కోదండ సీతారామ స్వామి, వారి కళ్యాణ మహోత్సవం జరుపబడును అని తెలిపారు. 22వ తేదీ శనివారం ఉదయం 8:30 గంటలకు పూర్ణాహుతి సాయంత్రం 6 గంటల నుండి స్వామి వారి సన్నిధానంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించబడును అని తెలిపారు. భక్తులు చుట్టుపక్క గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో పూజలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## శశి థరూర్‌పై కోర్టు ఆగ్రహం, జరిమానా



కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించి పరోక్షంగా చేసిన అనుచిత వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్‌కు ఢిల్లీ కోర్టు జరిమానా విధించింది. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకుడు రాజీవ్ బబ్బర్ దాఖలు చేసిన దాఖలైన పరువు నష్టం కేసులో పదేపదే హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు ఆయనకు రూ. 5వేల జరిమానా విధించింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 4వ తేదీకి వాయిదా వేసింది. ఈ విచారణకు హాజరుకావాలని అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ విశాల్ పహుజా ఆయనను ఆదేశించారు. కాగా 2018లో బెంగళూరు సాహిత్య ఉత్సవంలో శశి థరూర్ ఈ వివాదాస్పద వాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని శివలింగంపై తేలులా ఆరెస్సెస్ వారు భావిస్తుంటారు.

ఆ తేలును చేత్తో తీసేయలేం. చెప్పుతో కొట్టలేం అనుకుంటుంటారు. ఈ విషయం ఆరెస్సెస్‌లోని ఒక వ్యక్తి ఓ జర్నలిస్ట్‌కు చెప్పారంటూ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్ని రేపిన సంగతి తెలిసిందే.

## కవి సమయం

### కనిపించే దైవం గురువు

అజ్ఞాన తిమిరాన్ని తరిమి
జ్ఞాన జ్యోతిని వెలిగించి
విద్య ఓ తపస్సు జీవితానికది
ఒక ఉషస్సు అని భోదించి

మానవ మనుగడకు
విద్య మూలాధారమని
విద్యార్థి జీవితాన్ని
దిశ నిర్దేశం చేసి

వినయ విధేయతలు విద్య ద్వారానే
వ్యక్తికి సంక్రమిస్తాయని తెలిపి
ప్రతి నిత్యం విద్యార్థిగా ఉంటూ
మదిలో శోధించి బడిలో బోధించి

జ్ఞానాన్ని అందరికీ పంచి
వ్యక్తిని వ్యవస్థనీ సంస్కరించి
కనిపించే దైవంగా
పూజలందుకొంటున్న
గురువులందరకు పాదాభివందనం

రచయిత
ఆర్.శంకర్

## పంచాంగం

మాసం : మాఘ; తిథి : అష్టమి రా.8.27; విశాఖ ఉ.10.26; ప.వ.2.16ల 3.48.

ఆదివారం 16-02 -2020

**మేషం** : రుణం ఏ కొంత అయినా తీర్చగలుగుతారు. సేవా కార్యక్రమా ల్లోనూ, భక్తి కార్యక్రమాలలోనూ చురుకుగా పాల్గొంటారు. ఎదుటివారిని ఆకట్టు కునే ప్రయత్నంలో సఫలీకృతులవుతారు. కొత్త కొత్త పెట్టుబడుల పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిత్య, కంది, మినుము, నూనె వ్యాపారస్తులకు దిన దినాభివృద్ధి ఉంటుంది. **వృషభం** : జీవితంలో చక్కని మలుపు మీకు తెలియకుండానే జరుగుతుంది. పొదుపు ఆవశ్యకతను గురించి తెలుసుకుంటారు. స్త్రీలకు అనురాగ వాత్సల్యాలు పెంపొందుతారు. పాత మిత్రుల కలయిక మళ్ళీ మళ్ళీ జరగటం వల్ల మీలో ఎంతో ఉత్తేజాన్ని చేకూరుస్తుంది. కొత్త కొత్త వ్యాపారాల పట్ల ఏకాగ్రత వహిస్తారు. **మిథునం** :ఉన్నట్టుండి మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. విద్యార్థులకు కోపం తారాస్థాయికి చేకూరుతుంది. కంట్రోల్ చేసుకోవడం వల్ల బంధు మిత్రులతో గుర్తింపు లభించగలదు. పండ్ల, పూల, కొబ్బరి వ్యాపారస్తులకు కలిసివచ్చే కాలం. కొన్ని అలవాట్లు మీకు ఎంతో చికాకును కలిగిస్తాయి. **కర్కాటకం**: ఆర్థిక ఇబ్బంది అంటూ లేకపోయినా పురోభివృద్ధి అంటూ ఏదీ ఉండదు. ప్రయాణాలు మీకు అనుకూలించగలవు. మీరు తెలివైన వ్యక్తులతో జాగ్రత్త వహించండి. మీలో ఆత్మాభిమానం అధికమవుతుంది. ఐరన్, సిమెంట్, కలప, ఇటుక, వ్యాపారస్తులకు ఆశాజనకం. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. **సింహం**: ముఖ్యులకు బహుమతులు అందజేస్తారు. వస్త్ర, బంగారు, వెండి, లోహ, పీచు వ్యాపారస్తులకు ఆశాజనకం. ప్లీడర్లకు, ప్లీడరు గుమాస్తాలకు చేపట్టిన పనిలో అవరోధాలను ఎదుర్కొంటారు. మీ పెద్దల మూలంగా మీ సమస్యలు జటిలమవుతాయి. మతపరమైన విషయాలు చర్చకు రాగలవు. వైద్యుల సలహా తప్పదు. **కన్య**: విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. హోటల్, తినుబండారాల వ్యాపారులకు, క్యాటరింగ్ రంగాలవారికి కలిసివచ్చే కాలం. ఉన్నట్టుండి మీలో వేదాంత ధోరణి అధికమవుతుంది. మిమ్మల్ని వేరే వ్యక్తుల కలయిక వల్ల సంతృప్తి కానవస్తుంది. ప్రైవేట్ రంగాల వారు మార్పుల కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. **తుల**: పెద్దల ఆశీస్సులు మీకు మెండుగా లభిస్తాయి. ఇది సుఖపడే మార్గం అని రెడీమేడ్‌గా ఎక్కడా ఉండదు. మన మనస్సును బట్టి... మనలను బట్టి వుంటుంది. మీలో నిరుత్సాహాన్ని పక్కన పెట్టి ధైర్య సాహసాలతో ముందుకు సాగి జయం పొందండి. ప్రభుత్వ రంగ సంస్థల్లోని వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. **వృశ్చికం**: ఏ విషయంలోనూ ఊగిసలాట మంచిది కాదని గమనించండి. విద్యార్థుల్లో నూతన ఉత్తేజం కానవస్తుంది. ఏజెంట్లకు, బ్రోకర్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభదాయకంగా ఉండగలదు. సాంఘిక, సంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటారు. రుణం తీర్చాలనే ఆలోచనను క్రియా రూపంలో పెట్టండి. **ధనుస్సు**: యజమాన్యానికి సంబంధించిన విషయాలలో మీ సలహా ఎంతో సహకరిస్తుంది. ఎలక్ట్రికల్, టెక్నికల్ రంగాలవారికి కలిసివచ్చే కాలం. చిన్నచిన్న ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. జాగ్రత్త వహించండి. గృహంలో మార్పులు, చేర్పులు మీకు అనుకూలిస్తాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది. **మకరం**: తాపీ పనివారికి, చేతి పనివారికి కలిసివచ్చే కాలం. వ్యవసాయ తోటల రంగాలలోని వారికి కలిసివచ్చే కాలం. నిత్యవసర వస్తు స్టాకిస్టులకు, మిర్చి, నూనె వ్యాపారస్తులకు పురోభివృద్ధి కానవస్తుంది. దైవ సన్నిధిలో గడపగలుగుతారు. ముఖ్యులకు బహుమతులు అందజేస్తారు. పెద్దల గురించి ఆందోళన చెందుతారు. **కుంభం**: పీచు, లెదర్, హోమ్ వ్యాపారస్తులకు సంతృప్తి, అభివృద్ధి కానవస్తుంది. తోటివారితో అనుబంధాలు బలపడతాయి. సోదరీ, సోదరుల భావం అధికమవుతుంది. గతం కంటే ఇప్పుడు చాలా మెరుగ్గా ఉంటుంది. ధనం బాగా వెచ్చిస్తారు. మీ కలలు సాఫల్యమయ్యే కాలం ఆసన్నమైందని గమనించండి. **మీనం**: ట్రాన్స్‌పోర్ట్, ఆటో మొబైల్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. మార్పుల కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

# సౌరాష్ట్రే సోమనాథంచ..

సంకీర్తన





పరమశివుని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ప్రథమస్థానంలో వున్న సోమనాథక్షేత్రం గుజరాత్‌లో వుంది. లయకారకుడు జ్యోతిర్లింగ ఆకారంలో భక్తులకు యుగయుగాల నుంచి దర్శనమిస్తూ అభయమిస్తున్నారు. అనేక దండయాత్రలకు గురైనప్పటికీ తిరిగి పునర్ నిర్మితమైన క్షేత్రమది. సిరిసంపదలతో వున్న ఈ క్షేత్రంపైకి అనేక మంది విదేశీపాలకులు దండయాత్రలు చేశారు. చంద్రునికి శాపవిముక్తి జరిగిన క్షేత్రం కాబట్టే సోమనాథక్షేత్రంగా పేరొందింది. దక్షప్రజాపతి తన 27 కుమార్తెలను చంద్రునికిచ్చి వివాహం చేశాడు. అయితే చంద్రుడు రోహిణితో మాత్రమే సఖ్యంగా వున్నాడని మిగిలిన భార్యలు తమ తండ్రైన దక్షప్రజాపతికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం చెందిన ఆయన చంద్రుడు క్షయవ్యాధితో బాధపడాలని శాప మిచ్చాడు. దీంతో భూలోకంపై వచ్చిన చంద్రుడు ప్రస్తుత క్షేత్రమున్న ప్రాంతంలో శివ విగ్రహాన్ని ప్రతిష్టించి తపస్సు చేశాడు. తపస్సుకు మెచ్చిన పరమేశ్వరుడు ప్రత్యక్షమై శాపం నుంచి విముక్తి కలిగించాడు. 27 సతీ మణులను సరిసమానంగా చూసుకోవాలని చంద్రునికి హితవు పలికాడు. చంద్రునికి శాపవిముక్తి జరిగిన ప్రదేశం కాబట్టి సోమనాథక్షేత్రంగా పేరొచ్చింది.

చంద్రుడికి ఈ క్షేత్రంలో శాపవిముక్తి కలిగింది. దీంతో ఆయన పరమానందభరితుడై బంగా రంతో ఆలయం నిర్మించినట్టు తెలుస్తోంది. అనంతరం రావణా సురుడు వెండితో ఆలయాన్ని నిర్మించ గా, ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు చందనపు చెక్కలతో నూతన ఆలయాన్ని నిర్మించి నట్టు పురాణాలు పేర్కొం టున్నాయి. శివపురాణం, నంది పురాణంలో పరమేశ్వ రుడు ఇలా పేర్కొం టాడు. 'అన్ని చోట్ల నేనుంటాను. పన్నెండు ప్రదే శాల్లో మాత్రం మరింత ప్రభావ వంతంగా వుంటాను' ఈ పన్నెండు ప్రదేశాలనే ద్వాదశ జ్యోతిర్లింగాలు అని పిలుస్తారు. సాక్షాత్తు ఆ లయకారకుడు ప్రత్యక్షంగా ఈ క్షేత్రాల్లో కొలువైవున్నాడు.

అందుకనే ఈ క్షేత్రాలు పరమపవిత్రమైనవి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో గుజరాత్‌లోని సోమనాథ ఆలయం మొదటిది. అందుకనే ఇది మహిమాన్విత క్షేత్రమైంది. సోమనాథ క్షేత్రంలో భారీ సంపద వుండటంతో అనేకసార్లు దండ యాత్రలకు గురైంది. క్రీ.శ. 1024లో గజనీ పాలకుడైన మహమ్మద్ చేసిన దండయాత్రలో ఆలయం తీవ్ర నష్టానికి గురైంది. ఆ సమయం లోనే ఆలయం నుంచి ఎక్కువ సంపదను గజనీకి తరలించినట్టు చారిత్రక గ్రంథాలు వెల్లడిస్తున్నాయి. అనంతరం స్థానిక పాలకులు తిరిగి నిర్మించారు. దిల్లీ పాలకుడైన అల్లావుద్దీన్ ఖిల్జీ, మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ పాలనలోనూ ఆలయంపై దాడులు జరిగాయి. జునాగఢ్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తరువాత ఉక్కుమనిషి, భారతదేశ ప్రథమ హోంమంత్రి వల్లభాయ్‌పటేల్ ఆలయాన్ని సందర్శించి పునర్ నిర్మాణానికి ఆదేశాలిచ్చారు. 1951లో నూతన ఆలయ నిర్మాణం పూర్తయింది. భారత దేశ రాష్ట్రపతి బాబురాజేంద్రప్రసాద్ ఆలయాన్ని ప్రారం భించారు.

ఆలయాన్ని తిరిగి నిర్మించేందుకు నిధుల సేకరణ చేయకుండా కేవలం భక్తులు ఇచ్చిన విరాళాలతో నిర్మించడం విశేషం. యుగయుగాలుగా భక్తుల కోసం కొలువైవున్న సోమనాథమూర్తి తన దివ్యశక్తితో అందరిని ఆశీర్వదిస్తుంటారు.

**సౌరాష్ట్రే సోమనాథంచ...**

ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనాల్లో మొదటి లింగం సోమనాథ్‌లో వుంది. ఈ పట్టణాన్ని ప్రభాస్ పటాన్ అనికూడా పిలుస్తారు.

**DISTANCE EDUCATION**
A.U. డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో B.A, B.Com. అడ్మిషన్లు జరుగుచున్నవి మరియు డిగ్రీ రెగ్యులర్‌లో చదివి Discontinued లేదా Fail అయిన సబ్జెక్టులను నవంబర్‌లో పూర్తి చేసుకోవచ్చు.
అడ్మిషన్లు చివరి తేది : 24-02-20
90145 48285
78423 53237

**నటీనటులు కావలెను**
ఫిబ్రవరిలో షూటింగ్ జరిగే టెలిఫిల్మ్ & షార్ట్ ఫిల్మ్‌లో నటించేందుకు నూతన నటీనటులు కావలెను. ఆసక్తిగల వారు ఫోటోలతో సంప్రదించగలరు.
72889 19468

# సుప్రీంకోర్టు తీర్పు సామాజిక న్యాయానికి పెద్ద విఘాతం

## డిహెచ్‌పిఎస్ మండల మహాసభలో డాక్టర్ బూసి వెంకటరావు ఆవేదన


మాట్లాడుతున్న డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరావు

నర్సీపట్నం : రిజర్వేషన్లు అమల్లో సుప్రీం తీర్పుపై కేంద్రం రివ్యూ పిటిషన్ వేయాలని, సుప్రీం తీర్పు సామాజిక న్యాయానికి పెద్ద విఘాతం కలిగిస్తుందని డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బూసి వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో దళిత హక్కుల పోరాట సమితి నర్సీపట్నం మండల మహాసభ జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అసలు రిజర్వేషన్ విధానం కొనసాగింపుపైనే ఇది అనిశ్చితి సృష్టించిందన్నారు. రిజర్వేషన్లను ప్రైవేటు రంగానికి విస్తరించాల్సిన సమయంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటినుండీ ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్లు అంశాన్ని లేవనెత్తుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి ఐక్యంగా పోరాడి సామాజిక హక్కులు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు డి.చినరాజుబాబు, విశాఖ అర్బన్ అధ్యక్షులు గుడాల రాంబాబులు ప్రసంగించారు.

ఈ సందర్భంగా మండలానికి డిహెచ్‌పిఎస్ అధ్యక్షులుగా యాదిరి దాసు(పెదబొడ్డేపల్లి), ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజులను ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, రోలుగుంట తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

# చెయ్యేరులో కామ్య వృషోత్సర్జన మహోత్సవం



కాట్రేనికోన : కాట్రేనికోన మండలం చెయ్యేరు కాలువ గట్టు వద్ద కామ్య వృషోత్సర్జన మహోత్సవం జరిగింది బ్రహ్మశ్రీ ఆకొండి మహేష్ శర్మ ఆధ్వర్యంలో సలాది అచ్యుత రామయ్య దుర్గాకుమారి కోడి అంజనీకుమార్ నాగలక్ష్మి రాజామణి దంపతులుచే లోక కల్యాణార్ధం గోవృషభ కళ్యాణంలో ముందుగా విఘ్నేశ్వర పూజా పుణ్యాహవాచనం పరిషత్ దేహ శరీర శుద్ధి కొరకు కృఛ్రత్రయం రక్షాబంధనా అగ్నిప్రతిష్టాపన గోవృషభంనకు వైభోగంగా వివాహ క్రతువు నిర్వహించి అంబోతుకు శంఖు చక్రాలను వేసి ఊరేగించి భక్తులు అందరికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీగిరి సోదరులు బ్రహ్మానంద శర్మ కొల్లూరి శర్మ సోదరులు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి విస్తృతంగా వికేంద్రీకరణ విధానాలు

భీమునిపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రతిపాదించబడిన పరిపాలనా వికేంద్రీకరణ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళే కార్యక్రమాల్లో భాగంగా శనివారం వై.సి.పి విద్యార్థి యువజన విభాగం విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆర్.ప్రభాకర్ నాయుడు, యువజన విభాగం అధ్యక్షుడు భింగి.హరికిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంభేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి జీరు.వెంకట్ రెడ్డి, బి సి సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్రమని.మంగరాజు, ఎస్.సి.సెల్ అధ్యక్షుడు విజయ రమణ, బోని.సంజీవ్ రావు, కొంకి. వెంకటేష్ పాల్గొన్నారు.

# సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన



భీమునిపట్నం : భీమిలి సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో విద్యార్థులు తక్కువ ఖర్చుతో ఎక్కవ ప్రయోజనాలను చేకూర్చే విధంగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టు కున్నాయి. నిత్యం మనం వాడి పడేసిన వస్తువులను ఎంతో అందంగా తయారుచేశారు.ఇందులో 7వ తరగతి, 8 వతరగతి చదువుతున్న విద్యార్థులు తయారు చేసిన భవిష్యత్ నగరం, పేపర్ బ్యాగ్స్, సోలార్ సిస్టం, చూపరులను ఆకట్టుకుంది విద్యా ర్థులు తయారు చేసిన విధానం వారు చెప్పిన పద్ధతులు చూసి విద్యార్థుల తల్లి దండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్.ఎం. సిస్టర్ సీనా మాట్లాడుతూ విద్యా ర్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందు ఉండాలని అన్నారు. విద్యార్థులు ఎంతో కష్ట పడి ఈ ప్రదర్శన కోసం వ్యర్థ మైన వస్తువులతో సుమారు వంద నమూనాలు తయారు చేసి నందుకు ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం ఉపాధ్యాయు లను విద్యార్థులను హెచ్ఎం అభినందించారు.

# ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్కి శనివారం ప్రాకారసేవ ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటలకు శ్రీ స్వామి, అమ్మవార్లను ప్రాధాన రాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చి సర్వాంగ సుందరంగా తిర్చి దిద్దిన వెండి తిరుచ్చిపై ఆశీనులు గావించి భక్తుల గోవింద నామ స్మరణాలు, మేళ, తాళాలు సడుమ శ్రీ స్వామి, అమ్మవార్లను ముమ్మారు ప్రాధాన రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు.

ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రసాద్, సూపరింటెం డెంట్ అనకాపల్లి ప్రసాద్,లక్ష్మణ స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పాల్నాటి లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రెండోరోజు పింఛన్ తొలగింపుదారులు ధర్నా




నర్సీపట్నం : మున్సిపాలిటీలో రద్దు చేసిన పింఛన్లను వెంటనే తిరిగి పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు చేపట్టిన నిరాహారదీక్షలు రెండో రోజు శనివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ నిరుపేదలైన వృద్దులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్‌లు తొలగించడం అన్యాయమన్నారు. పింఛన్లు వెంటనే పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో మాజీ కౌన్సిలర్లు పైల గోవిందరావు, రెడ్డి అప్పలనాయుడు, పెన్షన్లు తొలగించబడ్డ బాధితులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోండి

## నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి

నర్సీపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి సూచించారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్ధం నూతనంగా ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను అమలు చేయుటకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీము ద్వారా మీరు ఇంతకు ముందు అనుమతి లేని లేఅవుట్లలో కొనుగోలు చేసిన మీ ప్లాట్లను క్రమబద్దీకరణ చేసుకోవచ్చునన్నారు. అనుమతి లేని లేఅవుట్లలోని ప్లాట్లకు స్థానిక పంచాయతీ వారి ద్వారా గానీ, పురపాలక సంఘం వారి నుండి గానీ భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయబడునన్నారు.

సదరు భవన నిర్మాణంను అనధికారంగా భావించి కూల్చివేతకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా సదరు అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లకు తదుపరి రిజిస్ట్రేషన్లు నిలివేయడం, బ్యాంకు రుణాలు కూడా మంజూరు కావన్నారు. అనుమతిలేని లేఅవుట్ల వలన క్రమబద్ధమైన ప్రణాళిక సాధ్యపడదన్నారు. అందులో ముఖ్యంగా మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, విద్యుత్‌తో పాటు కాలనీలో ఇతర రోడ్లకు సరైన అనుసంధానం లేకపోవుట వలన భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు.

కావున ప్రజలందరూ ప్రభుత్వం వారు కల్పించిన ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్‌లో దరఖాస్తును ఆన్‌లైన్‌లో మూడు నెలల్లోగా చేసుకోవచ్చునన్నారు. మరెన్ని వివరాలకు పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక అధికారిని సంప్రదించాలని ఆయన సూచించారు.

# 20వ వార్డులో రూ.37.65 లక్షలతో అంచనా వ్యయముతో పలు పనులకు శంఖుస్థాపన



విశాఖపట్నం : రూ. 17.65 లక్షల అంచనా వ్యయముతో జీవీఎంసీ పరిధిలో 20వ వార్డు అంగడిదిబ్బ అంగన్వాడీ భవనం నుండి ఓ-ఆప్టెక్స్ వరకు బీటీ రహదారి వేయుటకు మరియు రూ.20 లక్షల వ్యయంతో ప్రహ్లాద కల్యాణమండపం రహదారి నందు ఫుట్‌పాత్‌నకు టైల్స్ వేయటకు శనివారం విఎంఆర్‌డిఏ అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీనివాసరావు శంకుస్థాపన గావించారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీర్ గణేష్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ సత్యనారాయణ, సహాయక ఇంజనీర్ కిరణ్, వైఎస్సార్‌సీపీ వార్డు ప్రెసిడెంట్ పీతల వాసు, ప్రెసిడెంట్ ఊరకుటి నారాయణ, పి.చిన్నరావు, బుద్ధల అనురాధ, రాధ లక్ష్మి, ముమ్మన అప్పారావు, కనకల ఈశ్వర్, నీలాపు లక్ష్మి, కండిపిల్లి సతీష్, కోరాడ సురేష్, బుల్లెట్ రవి, డొప్ప సూరి, పడాల విజయ్ బెవర మహేష్, నడుపురీ రాజు,. ధనరాజు, ఉమామహేష్, పీతల తేజ, నమ్మి భరత్, సూర్యారావు వాకడ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.


గ్రేటర్ విశాఖ 24వవార్డులోని, బుక్కావీధి, టౌన్‌హాలు, పప్పుల వారి వీధిలో పింఛన్లును రీసర్వే చేసి తదనంతరం అర్హత కలిగిన పింఛనదార్లకు వైఎస్ఆర్‌సీపీ మహిళా నాయకురాలు, జివియంసి జోన్-3, టిఎల్ఎఫ్ అధ్యక్షురాలు బెహరా వెంకటరత్నం పింఛనకార్డులను పంపిణీ చేశారు.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.**
**O.S.1402/2019**
**Between:**
**M/s. Lakshmi Finance,**
**Rep.by its Special Power of Attorney Holder,**
**Kondra Anand ... Plaintiff**
**And:**
**Mallisetty Krishnamma & 2 others ... Defendants**
**NOTICE**
**To,**
**D-1) Mallisetty Krishnamma, W/o Chinna Venkaiah, Hindu, aged 36 years,D.No.21-51-8/1, Siddeswaram, Pedagantyada, Near: Ramalayam Temple, Gajuwaka, Visakhapatnam-530044.**
**D-2) Chilla Kanaka Raju, S/o Chilla Appa Rao, Hindu, aged 51 years, D.No.21-54-28, Siddeswaram, Pedagantyada, Near: Ramalayam Temple, Gajuwaka, Visakhapatnam-530044.**
Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are here by summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **13-03-2020 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.
**TULALA VENKATESWARA RAO,**
**KURUMUJI KOTESWARA RAO,**
**Advocates**
**Kancharapalem**
**Visakhapatnam-08**
**Cell No: 9985747149**

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.**
**O.S.1333/2019**
**Between:**
**M/s. Lakshmi Finance,**
**Rep.by its Special Power of Attorney Holder,**
**Kondra Anand ...Plaintiff**
**A n d:**
**Nambala Uday Kumar & 2 others ...Defendants**
**NOTICE**
**To,**
**D-1) Nambala Uday Kumar, S/o Suryanarayana, Hindu, aged 34 years,D.No.15-19/6, Baji Jn. Lakshmi Nagar, Near: China Anjaneyaswamy Temple, Visakhapatnam-530007**
Please take notice that the above named plaintiff has instituted the above suit against you.You are here by summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **11-03-2020 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.
**TULALA VENKATESWARA RAO,**
**KURUMUJI KOTESWARA RAO,**
**Advocates**
**Kancharapalem**
**Visakhapatnam-08**
**Cell No: 9985747149**

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM**
**O.S.1353/2019**
**Between:**
**M/s. Varun Finance,**
**Rep.by its Special Power of Attorney Holder,**
**Kondra Anand ... Plaintiff**
**A n d:**
**Patana Chenna Reddy & Another ... Defendants**
**NOTICE**
**To,**
**D-1) Patana Chenna Reddy, S/o Maridayya, Hindu, aged 33 years, D.No.6-143, Naidu Quarters, Near: Narsimha Theatre, Gopalapatnam, Visakhapatnam-530027.**
Please take notice that the above named plaintiff has instituted the above suit against you.You are here by summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **10-03-2020 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.
**TULALA VENKATESWARA RAO,**
**KURUMUJI KOTESWARA RAO,**
**Advocates**
**Kancharapalem**
**Visakhapatnam-08**
**Cell No: 9985747149**

# స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించాలి : మంత్రి మల్లాడి

యానాం : యువతీ, యువకులు ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీపడుతూ, స్వయ ఉపాధి మార్గాలను సైతం అన్వేషించాలని ఆవిధంగా ప్రయత్నించాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖామంత్రి మల్లాడి కృష్ణారావు ఎఎ పేర్కొన్నారు. శనివారం స్థానిక డేటా ప్రో కంప్యూటర్స్ ఆద్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్య కేంద్రం ద్వారా రోజ్ గా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రైవేట్ రంగం విస్తరిస్తున్నందున ప్రభుత్వ రంగంలో తగ్గుతున్న ఉపాధి అవకాశాల నేపథ్యంలో స్వయం ఉపాధికి నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉన్నటువంటి ఎ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా 25కి పైగా కంపెనీలకు జరిగిన రోజా జాబ్ మేళాకు 60కుపైగా నిరుద్యోగ యువతీ యువకులు హాజరైతే బం మందిని మెరిట్ ఆధారంగా ఎంపికలిశారు. ఈ కార్యక్రమంలో సిఐ గూటం శివగణేష్ మేనేజర్ మాత సూర్యనారాయణ తదితరులు పాలోన్నారు.

### రూ.5 కోట్ల 41లక్షలతో అభివృద్ధి పనులకు

# మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి) శంకుస్థాపన



భీమునిపట్నం: గ్రామాభి వృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, అందుకే గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి) అన్నారు. శనివారం భీమిలి మండలంలోని తాటి తూరు, మూలకుద్దు, రేఖవాని పాలెం పంచాయితీల్లో వివిధ అభివ ృద్ధి పనులకు రూ.5 కోట్ల 41 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సభలో మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లా డుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు ప్రత్యేక దృష్టి సాదించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వం గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ లు మరియు ఇతర వసతులను మెరుగు పరిచేందుకు ఈ శంకుస్థాపన చేపడుతున్నట్టు చెప్పారు. ప్రజల ముందుకే పరిపాలన తీసుకునిరావడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థను తీసుకు వచ్చినట్టు తెలిపారు. ప్రజ లకు ఎటువంటి సదుపాయాలు, ప్రభుత్వ పథకాలు పొందాలన్నా గ్రామ సచివాలయంలోనే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రజలకు పారదర్శక పాలన అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వం అమలు చేసిన అమ్మఒడి, పింఛన్లు, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు తదితర నవరత్నాలు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భీమిలి నియోజకవర్గాన్ని రాజకీయాలు,పార్టీలకు అతీతంగా అభివృద్ధిపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మూల కుద్దు, రేఖవాని పాలెం వైసిపి నాయకులు మాజీ ఏ.ఎం.సి డైరెక్టర్ కొల్లి కోటిరెడ్డి, కొయ్య.రాంబాబు, గురయ్య రెడ్డి, రేఖవాని పాలెం మాజీ సర్పంచ్ సమ్మిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఈ నెల17న డేటా సైన్సు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మిషన్ లెర్నింగ్ మరియు

## సైబర్ సెక్యూరిటీ అనే అంశం పై సదస్సు

భీమునిపట్నం : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెలలో 17న డేటా సైన్సు ఆర్టిఫి షియల్ ఇంటిలిజెన్స్ మిషన్ లెర్నింగ్ మరియు సైబర్ సెక్యూరిటీ అనే అంశం పై సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వి ఎస్.గణేష్‌లు తెలియజేశారు. ఈ కార్య క్రమానికి ఎ జీస్ స్కూల్ ఆఫ్ డేటా సైన్సు సైబర్ సెక్యూరిటీ మరియు బ్లాక్ చైన్ సంస్థ సిఈఓ భూపేష్ డుహేరియా ముఖ్య వక్త గా వ్యవ హిస్తారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్ర శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా అవంతీ విద్య సంస్థల అధినేత రాష్ట్ర పర్యాటక శాఖ అవంతి శ్రీనివాసరావు హాజరవు తున్నారని తెలిపారు.

## తమలపాకు అలంకరణలో శ్రీ దుర్గాలమ్మవారు



పూర్ణామార్కెట్ సమీపంలోని శ్రీ దుర్గాలమ్మవారు శనివారం తమలపాకులు అలంకారం లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ అమ్మవారివార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నట్లు ఆలయం ఈవో కే. శిరీష తెలిపారు.
ఆదివారం శ్రీ అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారు.

# గ్రామ వాలంటీర్లకు 48 స్మార్ట్ ఫోన్లు పంపిణీ

### - గ్రామ వాలంటీర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసిన వైసీపీ నాయకులు



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక పంచాయతీ ఆఫీసు వద్ద ఉన్న గ్రామ సచివాలయం -1వద్ద గ్రామ వాలంటీర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసారు.వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో భాగంగా గ్రామ వాలంటీర్ల నియామకం జరిగింది. వారి ద్వారా ప్రజలకు మేలైన సేవలు అందించాలని,ప్రతి ఒక్క ఇంటికి సంక్షేమ పథకాలను అందాలనే దిశగా శనివారం వాలంటీర్లకు నూతనంగా సెల్ ఫోన్లను ఇవ్వడం జరిగింది.ఇందులో ప్రతి ఒక్క కుటుంబం డేటాను నమోదు చేసి వారికి మెరుగైన సేవలందించే దిశగా గౌ. ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి పరిపాలన విధానం సాగుతుంది. అందులో భాగంగా శనివారం గ్రామ సచివాలయంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేతులమీదుగా గ్రామ వాలంటీర్లకు 48 సెల్ ఫోన్లు ఇవ్వడం జరిగింది. ఈ కార్య క్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి. అప్పారావు, దడాల సతీష్,ధారా.వెంకటరమణ, బొబ్బిలి వెంకన్న, కొల్లు.చిన్న, అల్లాడ సూరిబాబు, కొత్త.సత్య నారాయణ, పలివెల. కొండలరావు, సింగంపల్లి.రాము, బండారు. అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### 'మహా వైకుంఠనారాయణ యాగం' నిర్వహణకు

## విరివిగా విరాళములు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్య నారాయణ స్వామివారి దేవ స్థానం వారి ఆధ్వర్యంలో శ్రీ స్వామివారి దేవస్థానం నందు 11.03.2020 నుండి 19.3.2020 వరకు జరగనున్న "చతుర్వేద హవనసహిత పంచా యతన పూర్వక త్రిపాద్విభూతి మహా వైకుంఠనారాయణ యాగం" నిర్వహించుటకు గాను విశాఖ పట్నంకు చెందిన పారిశ్రామిక వేత్త బి. శ్రీనివాసరావు సుమారు రూ.1,10,000/-ఖర్చుతో యాగమునకు అవసరమగు ఇత్తడి సామాగ్రి మరియు పూర్ణా హుతికి అవసరమగు ద్రవ్య ములు ఏర్పాటు చేయుటకు విరాళముగా సూపరింటెండెంట్ దామెర కృష్ణారావుకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో నాగాభట్ల.రవి పాల్గొన్నారు.

## విశాఖను పరిపాలన రాజధాని చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం



కంచరపాలెం : శాసనమండలిలో ఆంధ్రప్రదేశ్ పరిపాలన వికేంద్రీకరణ బిల్లుకు వ్యతిరేకంగా చంద్రబాబు నాయుడు వ్యవహరించిన ధోరణికి, ప్రసంగాలకు, విధానాలకు వ్యతిరేకంగా, తెలుగుదేశం పార్టీ విధానాలను ఖండిస్తూ ప్రభుత్వ ప్రతిపాదనలను స్వాగతిస్తూ ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుతూ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో 35వార్డు ధర్మానగర్ హైవే వద్ద గల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పులమాల వేసి వినతి పత్రాలు సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో రేయి వెంకటరమణ, సిద్దార్థ రాజు, మాజీ కార్పొరేటర్లు బానాల శ్రీను, సేనాపతి అప్పారావు, జి.వి.రమణి, సదరం చిన్నప్పల నాయుడు, వార్డు అధ్యక్షులు కటుమూరి సతీష్, చల్లా ఈశ్వరావు, పైడి రమణ, బి.ఎర్రునాయుడు, పి.సునీత, కె.పి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తుల్లి చంద్రశేఖర్, రాయుడు శ్రీను, కొణతాల రేవాతిరావు, నాంభాళ ఈశ్వరావు, షేఖ్ బాబ్జి, బి.రాధ, స్వర్ణలత, జి.వి.రమణా రెడ్డి, కె.చిన్నా, గోవింద్, గద్రెటి రవిబాబు, చిరంజీవి, రాఘవులు, బి.గోవింద్, శ్రీను, ఐ.రవి కుమార్, పరదేశినాయుడు, రాంబాబు, అశోక్ రెడ్డి, కృష్ణంరాజు, కె.సుశీల, దమయంతి, సుజాత, స్వామి, వెంకట్, ఖాదర్, మల్లిక్, రాధ, మాలతి, రత్న, కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మావాగ్దేవి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ అను మా నూతన వ్యాపార సంస్థను మన జోన్ 4 కమిషనర్ పి.సింహాచలం ప్రారంభించారని తెలియచేస్తున్నందుకు సంతోషిస్తూ ఈ కార్యక్రమానికి విచ్చేసి, ఆశీర్వదించడానికి విచ్చేసిన మీ అందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలియచేస్తూ, మా వ్యాపార అభివృద్ధి కోసం మీ అందరి సహకారం అందించాలని కోరుకుంటూ
భానుప్రకాశ్, ద్వారాకానాథ్.



సర్క్యూట్‌హౌస్ లో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మరియు విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ కలిసి వార్డుల్లో ఉన్న సమస్యలను వివరించిన ఉత్తర నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు

### నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు యానాం బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులు

యానాం: తమిళనాడులోని ఈనెల 17 నుంచి 21తేదీవరకు ఓల్ మహాబలిపురంలోని సెయింట్ జోసఫ్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ లో జరిగే 65వ సీనియర్ నేషనల్ బాల్బడ్మింటన్ ఛాంపియన్‌షిప్పు యానాం ఎఎ బాడ్మింటన్ క్లబ్ క్రీడాకారులు ఎంపికయ్యారని క్లబ్ సెక్రటరీ కాపగంటి అనూరాధ ఆదర్శ శేష సుమన్ ఎ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రెడిలోవ నరేష్, కర్రి సూకేట వర్చలు ఎంపికయినట్లు పుదుచ్చేరి బాల్ బాడ్మింటన్ అసోషియేషన్ కార్యదర్శి కరుణాకరన్ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు ఎ అందినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులుకు శిక్షణ ఇచ్చిన కోమ్ బొటా శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు రాయపురెడ్డి విజయ్. గంగిరెడ్డి మనోహర్, సోమేశ్వరం శ్రీనివాస్, ముమ్మిడివరకు ప్రసాద్ తదితరులును పుదుచ్చేరి ఆరోగ్యశాఖా మంత్రి మల్లాడి కృష్ణారావు అభినందించారు.

### మత్స్యకారులకు దోమతెరలు పంపిణీ

యానాం : యానాం మార్కెట్లో చేపలు విక్రయించే పలువురికి దోమతెరలను పంపిణీ చేశారు. యానాం షేర్ల వీధికి చెందని పట్టా సరోజిని సంస్మరణార్థం కుమారుడు భైరవప్రసాద్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మార్కెట్లో మత్స్యకార మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో పొన్నమండ భద్రం, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## 24 నుంచి మీసాల వెంకన్న కల్యాణ మహోత్సవాలు

**8న స్వామివారి రథయాత్ర, మార్చి 18వరకు ఉత్సవాల నిర్వహణ అంగరంగ వైభవంగా జరిపేందుకు విస్తృత ఏర్పాట్లు**

యానాం : యానాంలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి(మీసాల వెంకన్న) వారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానుండటంతో ఏర్పాట్లును చేస్తున్నట్లు దేవస్థానం కమిటీ చైర్మెన్ కాపగంటి ఉమాశంకర్ శనివారం తెలిపారు. ఈ సంద ర్భంగా స్వామివారి ఆహ్వాన శుభపత్రికలను కమిటీ సభ్యుల ఆద్వర్యంలో ఆలయ ప్రాంగ ణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీవిళం బినామ సంవత్సర ఫాల్గుణ శుక్లపాడ్యమి 24 నుంచి మార్చి 18వరకు దివ్యకళ్యాణ మహోత్సవాలు జరుగనున్నవి. 24న సర్పవాహనం, 25న శేషవాహనం, 26న పుష్పక వాహనం, 28న అశ్వవాహనం, 29న సూర్య వాహనం, మార్చి 1న గజవాహనం, 2న పంచ ముఖ ఆంజనేయ వాహనం, 3న సింహ వాహనం, 4న హంసవాహనం,5న గరుడ వాహ నం, ధ్వజారోహణం నిర్వహించనున్నారు. 6న చింతా వెంకటసుబ్బారావు కుమారులచే స్వామి వారి దివ్యకల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. యానాం ప్రజల తరపున పుదుచ్చేరి ఆరోగ్యశాఖామంత్రి మల్లాడి క ృష్ణారావు. ఉదయలక్ష్మి దంపతులు ముత్యాల తలంబ్రాలు, మంగళసూత్రములు స్వామివారికి సమర్పించనున్నారు. పుదుచ్చేరి ప్రభుత్వం తరపున యానాం ఆర్ఎ ఒ శివరాజ్ మీనా, సీమా దంపతులు పట్టు పీతాంబరములు, సువర్ణ యజ్ఞోపవీతము స్వామివారికి సమర్పించ నున్నారు. అదే రోజు హనుమంత వాహనం, 7న పొను వాహనం. 8న కిండి వీరవెంకన్న వెంకట కృష్ణయ్య, యర్రా లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యే శ్వరరావు సోదరులచే రథయాత్రను ఘనంగా నిర్వహించనున్నారు. 9న చంద్ర వాహనం, 10నుంచి 12వరకు శ్రీపుష్ప యాగములు, 18న పవళింపు సేవ, 14 నుంచి 18 వరకు కొరాయి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

# వైకాపా రాష్ట్ర బీసీ కార్యాలయం ప్రారంభం

**వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్ర స్థాయి కార్యాలయాలన్నీ ఇక విశాఖలోనే : మంత్రి అవంతి శ్రీనివాస్**



చినవాల్తేరు: రాష్ట్ర బీసీ సంక్షేమ ప్రధాన కార్యాలయాన్ని విశాఖ చినవాల్తేరులోని అభిలాష అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి అవంతి శ్రీనివాస్, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిధులుగాహాజరై ఈ కార్యాలయాన్ని ప్రారంభింభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అవంతి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కార్యకలాపాలను బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యంపీ ఎంవివి సత్యనారయణ, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, వైకాపా నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు గరికిన గౌరి, విఎంఆర్‌డిఎ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ మరియు బీసీ సంఘాల ప్రతినిధులు వైకాపా ముఖ్య నాయకులు అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



*రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని సన్మానిస్తున్న వైకాపా మహిళా నాయకురాలు గండి జ్యోతి, విశాఖ లీగల్ సెల్ ప్రతినిధి కరణం కృష్ణ తదితరులు*

## ఒక్క యూనిట్ రక్తంతో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చు

### ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.సుమిత్ర



విశాఖపట్నం: విద్యార్థులు రక్తదాన శిభిరాల్లో చురుకుగా పాల్గొనాలని ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.సుమిత్ర అన్నారు, శనివారం రోటరీ బ్లడ్ బాంక్ సౌజన్యంతో న్యాయ కళాశాల మూట్ కోర్ట్ ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిభిరాన్ని ఆమగ ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని, దేశంలో రక్తలోటు చాలా ఉందని రోజులో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎక్కువ సంఖ్యలో యువత రక్తదానం చేయాలని అమె తెలిపారు, ఈ రక్తదాన శిభిరంలో 37 మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేసారు, ఈ కార్యక్రమంలో కళాశాల ఆచార్యులు డి. సూర్యప్రకాశరావు మధుసూదన రావు,సీతా మాణిక్యం,ఎల్.వి.కె. ప్రసాద్, రోటరీ బ్లడ్ బాంక్ ప్రతినిధులు డాక్టర్ అశోక కుమార్, పీఆర్వో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## క్రీడాకారులకు మంత్రి అభినందనలు



అమలాపురం : ఈ నెల 8 మరియు 9 తేదీలలో కర్నూలలో జరిగిన రాష్ట్రస్థాయి సపక్ తక్ర సిఎం పోటీలలో ద్వితీయ స్థానం సాధించి వెండి పతకాలు సాధించిన ముగ్గురు అమలాపురం క్రీడాకారులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అభినందించారు. శనివారం అమలాపురం రూరల్ మండలం కామనగ రువులోని మంత్రి క్యాంపు కార్యాల యంలో మంత్రిని కలిసిన క్రీడాకారులు కె.సతీష్, పాటి సన్ని, మరియు కె.ప్రసాద్‌ను మంత్రి అభినందిస్తూ భవిష్యత్‌లో క్రీడల్లో మరింతగా రాణించి అమలాపురానికి మంచి కీర్తి ప్రతిష్టను తీసుకురావాలని మంత్రి వారిని అభినందించారు. ఈ ముగ్గురు క్రీడాకారుల్లో కె.సతీష్ ఈ నెల 17వ తేదీన ఉత్తరప్రదేశ్‌లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపికైనట్లు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్సు కోచ్ జె.గౌతమ్ మంత్రికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయ కులు చెల్లుబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ పూలింగ్‌ను నిలుపుదల చేయాలి : సిపిఎం



విశాఖపట్నం: విశాఖ జిల్లాలోని 10 మండలాల్లో 6,116 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కోసం సమీకరించాలని గ్రామ సభలు నిర్వహించి సాగు రైతుల మీద తీవ్రమైన ఒత్తిడి చేశారు. అధికారులు, పాలక పార్టీ నాయకులు బెదిరింపులకు పూనుకొన్నారు. అయినప్పటికీ 3500 ఎకరాల భూ సమీకరణకే అనుకూలంగా లేఖలు వచ్చాయి. దీన్నిబట్టే ల్యాండ్ పూలింగ్‌కు దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల నుంచి ఎంత వ్యతిరేకత ఉందో దీన్ని బట్టి అర్థం అవుతోంది. అధికారులు ప్రకటించిన ల్యాండ్ పూలింగ్ భూములకు ప్రజల నుంచి అనుకూలంగా లేఖలు వచ్చాయన్నది అవాస్తవం. సత్య దూరం. ఇప్పటికైనా ప్రభుత్వం చేపడుతున్న ల్యాండ్ పూలింగ్‌ను నిలుపుదల చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది.

10 మండలాల్లో సమీకరించిన భూములను 59 బ్లాక్‌లుగా విభజించి కొన్ని బ్లాకులు పూర్తిగా పేదల ఇళ్ళ స్థలాలకు, మిగిలిన బ్లాక్‌లను రైతులకు, విఎంఆర్‌డిఎకు కేటాయిస్తామని అట్లాగే రైతులు కోరినచోట ఇస్తామని ప్రకటించారు. ఇది అవాస్తవం. విఎమ్ఆర్‌డిఎ నిబంధనలు.. ప్రభుత్వం ఇచ్చిన చోట నోటిఫికేషన్‌లో, భూమిని అభివృద్ధి చేసి 'లాటరీ పద్ధతిలో' ప్లాట్‌లు కేటాయించాలని ఉంది. కానీ అధికారులు దీనికి భిన్నమైన ప్రకటన చేయడం విడ్డూరంగా ఉంది. ఇది ప్రజలను మోసం చేయడమే. భూములను నమ్ముకుని అభివృద్ధి కండి అని గతంలో ప్రభుత్వం ప్రచారం చేసేది. నేడు దీనికి భిన్నంగా భూములు అమ్ముకోండి లక్షాధిపతులు కండి అని ప్రచారం చేస్తోంది. నాడు పేదలకు భూములను ప్రభుత్వం కొనుగోలు చేసి అభివృద్ధి చేసి ఇచ్చేది. నేడు పేదల భూములన బలవంతంగా లాక్కొని వియంఆర్‌డిఎ ద్వారా 'రియల్ ఎస్టేట్' వ్యాపారాన్ని వేగవంతం చేస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన 3500 ఎకరాల భూముల్లోనూ తరతరాలుగా పంటలు వేసుకొని ప్రజలు జీవిస్తున్నారు. గత 25 సం॥లు నుండి ఈ భూములను అర్బన్ అగ్లమిరేషన్ పేరుతో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదు. నేడు సాగు చేసుకుంటున్న పేదలను అక్రమదార్లుగా ప్రకటించడం దుర్మార్గమైన చర్య.

ఇప్పటికైనా ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌కు స్వస్తి పలికి విశాఖలో కబ్జాకు గురైన భూములను వెంటనే ధనవంతుల నుంచి రాబట్టి పేదలకు ఇళ్ళు స్థలాలు పంపిణీ చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ కోరుతోంది.

## ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో తమ మొట్టమొదటి స్టోర్‌ను ప్రారంభించిన ప్రీమియం మెన్స్ వేర్ బ్రాండ్, లూయిస్ ఫిలిప్పీ




కాకినాడ: భారతదేశపు సుప్రసిద్ధ ప్రీమియం, ఇంటర్నేషనల్ మెన్స్ వెర్ బ్రాండ్ లూయిస్ ఫిలిప్పీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడలో తమ మొట్టమొదటి స్టోర్‌ను ప్రారంభించింది. నూతనంగా ఏర్పాటుచేసిన ఈ స్టోర్ అయ్యప్ప టవర్స్, మెయిన్ రోడ్, సూర్యారావు పేట, కాకినాడ, ఆంధ్రప్రదేశ్ వద్ద ఉంది. ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ లిమిటెడ్ మొట్టమొదటిసారిగా 1989 సంవత్సరంలో లూయిస్ ఫిలిప్పీని భారతదేశానికి తీసుకువచ్చింది. అప్పటి నుంచి ఈ బ్రాండ్ క్లాసిక్ మరియు కంటెపరరీ క్లాతింగ్ కు ఖ్యాతి గడించింది. కాకినాడలో తమనూతన స్టోర్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఫరీదా కాలియాదన్, సీఓఓ, లూయిస్ ఫిలిప్పీ మాట్లాడుతూ రిటైల్ విభాగపు వృద్ధితో పాటుగా వినియోగదారుల నుంచి పెరుగుతున్న డిమాండ్ కారణంగా బ్రాండ్ కు అత్యంత ఉత్సాహపూరితమైన మార్కెట్ గా కాకినాడ నిలిచింది. ఈ నగరంలో మా మొట్టమొదటి స్టోర్‌ను ప్రారంభిస్తుండటం పట్ల చాలా సంతోషంగా ఉన్నాం. ప్రతి సందర్భానికి తగినట్లుగా వైవిధ్యమైన ప్రీమియం ఫ్యాషన్ ట్రెండు ఈ స్టోర్ లో అందుబాటులో ఉంచాం. నగరంలో లూయిస్ ఫిలిప్పీ ప్రవేశించడంతో ఇక్కడ షాపింగ్ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. ఇక్కడ ప్రజల అవసరాలను మేము పూర్తిగా అర్థం చేసుకున్నాం. వారి అంచనాలను మించిన రీతిలో అనుభవాలను ఈ స్టోర్ లో అసాధారణ నాణ్యత, అత్యున్నత పనితనం, సాటి లేని రిటైల్ అనుభవాలతో అందించనున్నాం.. అని అన్నారు. భారతదేశంలో ప్రీమియం మెన్వర్ విభాగంలో అగ్రగామి లూయిస్ ఫిలిప్పీ. ఈ బ్రాండ్ స్థిరంగా మారుతున్న వినియోగదారుల అవసరాలను తీర్చే రీతిలో ఫార్మల్స్, సెమీ - ఫార్మల్స్, కస్టమ్-మేడ్ క్లాతింగ్, యాక్ససరీలను అందించనుంది. స్టైల్స్ పట్ల అమిత శ్రద్ధ చూపే పురుషుల కోసం కాకినాడలోని ఈ నూతన స్టోర్ లో సూట్స్, షర్ట్స్, ట్రెజర్స్, టీ-షర్ట్స్, జీన్స్, ఫుట్ వేర్, యాక్ససరీస్ కలెక్షన్ అందుబాటులో ఉంటుంది. ఈ స్టోర్ లో సీజనకు సంబంధించి తాజా ఆఫరింగ్ అయినటువంటి పెర్మా ప్రెస్, ద ఫైనెస్ట్ థింకిల్ ఫ్రీ, కాలాతీత గాడ్స్ అండ్ కింగ్స్ శ్రేణి, ఎక్స్ క్లూజివ్ లగ్జరీ వెడ్డింగ్, ఎల్ పీ లగ్జర్ మరియు అత్యున్నత పనితీరు కలిగిన అథ్ వర్క్ లైన్ సైతం అందుబాటులో ఉంటుంది. ఈ లూయిస్ ఫిలిప్పీ స్టోర్ లో పురుషుల వార్డ్ రోబ్ కు మరింత వన్నెలద్దే అత్యాధునిక శైలి అయినటువంటి ఎలక్ స్పోర్ట్స్, ఎల్ పీ జీన్స్ వంటివి సైతం అందుబాటులో ఉంటాయి.

# నేర మూలాలపై ప్రతి ఒక్కరూ మాట్లాడాలి

## శారద నికేతన్ స్కూల్ నూతన భవన ప్రారంభోత్సవ సభలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రజని




అరుకు వేలీ: సమాజంలో పెరుగుతున్న నేరాలపై బాధపడ్డం కంటే నేర మూలలను ఛేదించాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ టి.రజని అన్నారు. డి.శారద ట్రస్ట్ నిర్వహిస్తున్న అరకువేలీలో శారద నికేతన్ పాఠశాల నూతన భావనాలను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రజని మాట్లాడుతూ స్పందించాల్సిన సమయంలో ప్రజలు స్పందించకపోవడం వల్ల నేరాలు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. సమాజంలో పెరుగుతున్న రుగ్మతలపై ప్రతి ఒక్కరూ మాట్లాడాలని అన్నారు. ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడానికి స్కూల్లోనే పిల్లలకు పునాదులు పడతాయని అన్నారు. లాభాపేక్ష లేకుండా గిరిజన పేద పిల్లల కోసం నిర్వహిస్తున్న శారద నికేతన్ స్కూల్ పిల్లలు ఉత్తమ పౌరులుగా తయారవుతారన్న విశ్వాసం తనకు ఉందన్నారు. గిరిజన ప్రాంతంలో పేద పిల్లల విద్యాభివృద్ధికి స్కూల్ నిర్వహించడం ఎంతో స్ఫూర్తి నిస్తోందన్నారు. నేరం చేయడం వెనుక గల కారణాలను లోతుగా పరిశీలిస్తే సమాజం సరైన సమయంలో స్పందించడంలేదని అనిపిస్తోందన్నారు. నేరంపై తీర్పు చెప్పేముందు చాలా లోతుగా ఆలోచించి, పరిస్థితులను విశ్లేషించిన క్రమంలో నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపానని గుర్తుచేశారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, ట్రస్ట్ సలహాదారు సిహెచ్. నర్సింగరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే నాణ్యమైన విద్య అందించే పాఠశాల లు అవసరమని అన్నారు. గిరిజన పిల్లలకు శారద నికేతన్ ఎంతో దోహదపడుతొందన్నారు. ఈ కార్యక్రమంలో శారద ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వి.తిరుపతిరావు, అరకు ఫస్టుక్లాస్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ పరేశ్ కుమార్, శారద ట్రస్ట్ సలహాదారు, నీటిపారుదల శాఖ విశ్రాంత ఛీఫ్ ఇంజనీర్ ఎస్.సత్యనారాయణ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు, ట్రస్ట్ సలహాదారు బి.ప్రభావతి, స్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.సురేంద్ర, రోజా, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



**నిండ్ర మండలం దేవదారు కొడియంబేడు గ్రామంలో అంచనా విలువ 2.18 కోట్ల రూపాయలు విలువగల ఇవీపీ ఆంధ్రా బ్యాంకు నిధులతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణము పనులు కొరకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే ఆర్కే రోజా**



వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 16వ తారీఖున ఉచిత ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వంశీకృష్ణ యాదవ్ తెలిపారు టాలెంట్ ఏరా ఇన్ఫో సొల్యూషన్స్ ఖాళీలు ఉన్న బీపీఓ వాయిస్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్ల పోస్టుల భర్తీ చేసేందుకు ఇంగ్లీష్ మరియు హిందీ భాషలలో ప్రావీణ్యం కలిగి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మద్దిలపాలెంలో గల వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి తమ ఇంటర్వ్యూ హాజరు కావాలని 89197 60265 9948877883 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని కోరారు

### వాలంటీర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి-మంత్రి విశ్వరూప్

అమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను నిరు పేదలకు అందించడంలో గ్రామ వాలంటీర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగించుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సూచించారు. శనివారం అమలాపురం రూరల్ మండలం బండారు లంక గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద 65 మంది గ్రామ వాలంటీర్లకు ప్రభుత్వం అందించిన సెల్ ఫోన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన యాప్‌లు ఈ సెల్‌ఫోన్లలో నిక్షిప్తమై ఉన్నాయని, నీటి సహాయంతో గ్రామాలలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో వాలంటీర్లు చురుకుగా పనిచేయాలని మంత్రి తెలియజేశారు. మరిన్ని యాప్‌లు ఈ సెల్‌ఫోన్‌లో నిక్షిప్తమై ఉన్నాయని వాటన్నింటిని వాలంటీర్లు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.

# బాబు హయాంలో వేల కోట్ల అవినీతి

- రాష్ట్ర ప్రజలకు బాబు క్షమాపణ చెప్పాలి
- మనీ ల్యాండరింగ్‌లో బాబు దిట్ట
- బాబు & కో లను విచారించి, వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేయాలి
- చంద్రబాబు అవినీతిపై పవన్ ప్రశ్నించాలి? మంత్రి అవంతి శ్రీనివాస్ డిమాండ్



విశాఖ సిటీ: రాష్ట్ర విభజన అనంతరం అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానంటూ రాష్ట్ర ప్రజలను నమ్మబలికి వేల కోట్ల రూపాయలు ప్రజా ధనాన్ని వృధా చేస్తూ మరికొన్ని వేల కోట్ల రూపాయల అవినీతిని చేస్తూ గడచిన ఐదు సంవత్సరాలలో రాష్ట్రాన్ని లూటి చేశారని రాష్ట్ర పర్యాటక సా మంత్రి అవంతి శ్రీనివాస్ మాజీ సీఎం చంద్రబాబుపై ధ్వజమెత్తారు. శనివారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ వేల కోట్ల రూపాయలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ రాష్ట్ర అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్న మాజీ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. సాక్షాత్తు మాజీ సీఎం చంద్రబాబు హయాంలో, తన పీఎస్ దగ్గర 2 వేల కోట్లు దొరకడం దేశ చరిత్రలో ఎప్పుడూ చూడలేదని, సాక్ష్యాలతో సహా చంద్రబాబు, లోకేష్, నారాయణ తదితరులు అడ్డగోలుగా దొరికిపోయారని, వారి పాస్ పోర్టులు తక్షణమే సీజ్ చేసి కేంద్ర హోంమంత్రి ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీలతో లోతైన దర్యాప్తు చేయాలి. అని మంత్రి అవంతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇదే విధంగా తన తనయుడు లోకేష్‌ను అడ్డదారుల్లో మంత్రిని చేసి ఎన్ని వేల కోట్ల రూపాయలు మనీ ల్యాండరింగ్ జరిపారో అంటూ ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. దేశ చరిత్రలోనే ఇంతటి అధిక మొత్తంలో మనీ ల్యాండరింగ్ జరపడంలో చంద్రబాబు దిట్ట అని ఆయన అన్నారు. పోలవరం, పట్టిసీమ తదితర ప్రాజెక్టులలో తన అనుయాయులకు కాంట్రాక్ట్‌లిప్పించి మరింత ధనాన్ని దోచుకున్నారని మంత్రి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఉన్న అక్కసుతో దేశమంతా పర్యటించి ఆయా రాష్ట్రాల ఎన్నికలకు అయ్యే ఖర్చును మన రాష్ట్రం నుండి మన సంపదను ఇతర రాష్ట్రాల నేతలకు మనీల్యాండరింగ్ ద్వారా ముట్టజెప్పారన మంత్రి ఆరోపించారు. రాష్ట్ర సంపదను ఇంతటి విచ్చలవిడిగా వృధా చేసేందుకు చంద్రబాబుకు అధికారమెవరిచ్చారని, రాష్ట్రమేమైనా చంద్రబాబు జాగీరా అని ఆయన నిలదీశారు. చంద్రబాబు, లోకేష్, టీడీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి వల్లే మోదీకి దూరమైపోయారు. రైల్వే కాంట్రాక్టర్లను బెదిరించి మరీ టీడీపీ నేతలు కమీషన్లు వసూలు చేశారు.అయినా టీడీపీ నాయకులు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు. పవన్‌కు నీతి, నిజాయితీ ఉంటే చంద్రబాబు అక్రమాలను ప్రశ్నించాలని పవన్‌కు అవంతి బహిరంగంగా సవాల్ విసిరారు.

బిజెపి విషయంలో పార్టీ పరమైన, విధాన పరమైన నిర్ణయాలు పార్టీ అధినేత తీసుకుంటారని అవంతి శ్రీనివాస్ అన్నారు. ఫెడరల్ విధానంలో రాజకీయాలు వేరు... ప్రభుత్వ విధానాలు వేరు. బీజేపీతో మాకేమీ శత్రుత్వం లేదు. అమరావతిని తరలిస్తున్నామని మేం చెప్పలేదు. మూడు రాజధానులను మాత్రమే ఏర్పాటు చేస్తున్నాం. విశాఖ, అమరావతి, కర్నూలులోనే రాజధానులను పెడుతున్నామనీ, పరిపాలనా రాజధాని విశాఖలో కాకుండా ఒడిషాలో పెట్టడం లేదు కదా, కర్నూలులో హైకోర్టు పెడుతున్నామే తప్ప బెంగుళూరులో పెట్టడం లేదు కదా అని మంత్రి అవంతి టిడిపి రాజకీయ నిరుద్యోగులను ప్రశ్నించారు. ఈ మీడియా సమావేశంలో యంపీ ఎంవివి సత్యనారాయణ, విఎంఆర్‌డిఎ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, బెహరా భాస్కరరావు, వెంకటరావు పాల్గొన్నారు.

## పేదల ఇళ్ల కోసమే భూసేకరణ

- ల్యాండ్ పూలింగ్‌పై టీడీపీ తప్పుడు ఆరోపణలు .. రిసోర్స్ పర్సన్స్‌కు 10 రోజుల్లో జీతాలు
- పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

వెలుగు రిసోర్స్ పర్సన్స్‌కు రూ.10 వేలకు పెంచిన జీతాలు మరో పది రోజుల్లోగా చెల్లిస్తామని పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ నగర పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలలో లక్షా 70 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలను అందజేయనున్నట్లు చెప్పారు. దీనికి అవసరమైన భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరిస్తున్నామని తెలిపారు. బలవంతంగా భూములను సేకరిస్తున్నామని ప్రతిపక్షాలు ఆరోపించడం తగదన్నారు. ల్యాండ్ పూలింగ్‌ను అడ్డుకున్న వారు ప్రజలకు అనుకూలమా? ప్రతికూలమా? అని మంత్రి అవంతి ప్రశ్నించారు.

నిలిపివేయబడిన పింఛన్ల ను అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు.

### సమాజంలో విలువలు పెరిగినప్పుడే

# సమస్యలకు పరిష్కారం

### గీతం జాతీయ సదస్సులో జస్టిస్ రజని



సాగర్‌నగర్ : సమాజంలో పెరుగుతున్న నేరాలకు, ఘర్షణలకు మూలకారణం విలువలు లోపించడమే అని అలాగే విద్యా, వైద్య, న్యాయ వృత్తిలో ఉన్నవారికి విలువలు పాటించడం అన్ని సమస్యలకు పరిష్కారం చూపగలదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ టి.రజని పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా మరియు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) సంయుక్తంగా నిర్వహిస్తున్న లా, మెడిసెన్ ఇంటర్ డిసిప్లీనరీ పర్స్‌పెక్టివ్ జాతీయ సదస్సును ముగింపు సభకు శనివారం అమె ముఖ్యఅతిధిగా హజరై ప్రసంగించారు. అవినీతిని, అనైతిక చర్యలను ఓర్పుతో సహించగలిగిన ప్రజలు నేరస్తుల పట్ల అదే విధమైన ఓర్పును ప్రదర్శించలేకపోతున్నారని, నేరానికి పాల్పడినివారిని ఎన్‌కౌంటర్ చేయాలన్నంత కోపాన్ని ప్రదర్శిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. వీధులలో నిర్లక్ష్యం చేయబడిన బాలలు, పొట్టకూటి కోసం చేయ కూడని పనులు చేసే వారిని ప్రాధమిక దశలోనే పట్టించుకోక పోవడం వల్ల వారు సమాజానికి నేరస్తుల రూపంలో తయారవుతున్నారని గ్రహించాలన్నారు. మన నడవడిక సరైన గమ్యంలోనే ఉందా అనేది సమాజంలో ప్రతి ఒక్కరు ప్రశ్నించుకోవాలన్నారు.

గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ నైతిక విలువలు పాటించడం ద్వారా సమాజంలో ఒకరిపై ఒకరికి నమ్మకం పెరుగుతుందని అయితే ప్రస్తుతం సమాజంలో వ్యక్తులపైన, వ్యవస్థలపైన అలాంటి నమ్మకం సన్నగిల్లిటంతో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. వైద్యులు వృత్తిలో విలువలు పాటించడం ద్వారా ప్రజలకు తమపై నమ్మకం పెరిగేలా చూసుకోవాలన్నారు. తాత్కాలిక లాభం కోసం చూసుకుంటే కాలక్రమంలో వైద్యులు ప్రజల విశ్వాసం కోల్పోతారని అభిప్రాయపడ్డారు. వైద్య రంగానికి, న్యాయ రంగానికి ఉపయోగపడే కొత్త కోర్సులపై గీతం దృష్టి సారిస్తుందన్నారు.

గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతూ లా మరియు మెడికల్ కోర్సుల మద్య సమన్వయంతో నూతన సబ్జెక్టులను, విభాగాలను నెలకొల్పేదిశగా ప్రయత్నం జరగాలన్నారు.

రాంచి జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.కేశవరావు మాట్లాడుతూ ఈరోజు చేసే చట్టాలు రేపటి కాలానికి ఉపయోగ పడకపోచ్చునని అందుకే కాలానుగుణ మార్పులపై న్యాయస్థానాలు ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తాయన్నారు. దేశ సంస్కృతిలో, కట్టుబాట్లలలో వస్తున్న మార్పులు వల్ల కొత్త చట్టాల అవసరం పడుతోందన్నారు. సరోగసి (అద్దెగర్భధారణ)కి భారత దేశం అడ్డాగా మారుతోందని అందుకే దీనిని నియంత్రించే కొత్త చట్టం రూపొందిందన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ ఆర్.అనితారావు, జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.జ్యోతి పద్మజ పాల్గొని ప్రసంగించారు.దేశంలోని వివిధ కళాశాలల నుంచి ప్రొఫెసర్‌లు, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

### కలింగ వంశీయుడు జగదీష్ దానేటికి

## స్వరూపనందేంద్ర రాజ ఖడ్గ బహుకరణ



విశాఖపట్నం : కలింగ వారసుడు జగదీష్ దానేటి కలింగ వార్ చిత్రాన్ని నిర్మించాలని తలపెట్టడం తన పురిటిగడ్డ కలింగ సీమ రుణం తీర్చుకోవడమేనని శ్రీ శరదాపీఠ వ్యవస్థాపకులు శ్రీ స్వరూపనందేంద్ర సరస్వతి కొనియాడారు. విశాఖపట్నంలోని శరదాపీఠలో శనివారం నాడు హాలివుడ్ చిత్రభ్రుంధం స్వామిజీని కలిసారు.

ఈ సంధర్భముగా ఆయన కలింగ వార్ చిత్ర దర్శకులు జగదీష్ దానేటికి రాజ ఖడ్గం ను బహూకరించి ఆశీర్వచనం అందించారు. ప్రపంచ దేశాలలో హింస పెచ్చురిల్లుతున్న ఈ తరుణంలో అశోక చక్రవర్తి శాంతి భీజాలు నాటిన కలింగ యుద్ధం ఒక హాళివుడ్ చిత్రంగా తీయాలనుకోవడం సుభసూచకమని అన్నారు. కలింగ వార్ చిత్రం ద్వార ప్రపంచ దేశాలకు అహింస, శాంతి సందేషాలను అందించాలనే ఆలొచన అభినందనీయమని ఆయన దర్శకుడు జగదీష్ ని కొనియాడారు.

ఈ చిత్ర ఉద్దేశ్యం తనకు బాగ నచ్చిందని స్వామీజి చెప్పారు. భరతదేశంలో జరిగిన కలింగ యుద్ధం నేఫధ్యముగా చిత్రం తీయాలని హాలీవుడ్ చిత్ర నిర్మాణ సంస్థ - పింక్ జాగ్వర్స్ ఎంటర్టైన్మెంట్ ముందుకు రావడం తనకు ఎంతో సంతోషం కలిగించిందని స్వామీజి అన్నారు. స్వామీజిని కలిసినవారిలో పింక్ జాగ్వర్స్ ఎంటర్టైన్మెంట్ మేనెజింగ్ డైరెక్టర్ సువర్ణ పప్పు, హాలీవుడ్ దర్శకుడు, నిర్మాత జాని మార్టిన్, హాలీవుడ్ నటి లిలిన్ రావ్ లు ఉన్నారు. ఒక మంచి లక్షంతో చిత్రనిర్మానానికి పూనుకున్నందుకు ఈ భ్రుందాన్ని స్వామి స్వరూపనందేంద్ర సరస్వతి అభినందించి, యగ్నంలా తలపెట్టిన ఈ కలింగ వార్ చిత్రం విజయవంతం కావలని వారందరిని ఆశీర్వదించారు.

### విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు

## ఫిర్యాదుల పెట్టె

### సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్

విశాఖపట్నం: విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కొరకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో అన్ని సెక్షన్ కార్యా లయాలు /ఈఆర్‌ఓలు /సబ్ డివిజన్ కార్యాలయాలు / డివిజన్ కార్యాలయాలు, సర్కిల్ మరియు కార్పోరేట్ కార్యాలయాల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేసామని సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, విద్యుత్ బిల్లులలో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం , ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, విద్యుత్ బిల్లులలో పేరు మార్పిడి, వేలాడుతున్న విద్యుత్ తీగలతో ఎదురవుతున్న సమస్యలు తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై విద్యుత్ శాఖాధికారులు సకాలంలో స్పందించనట్లయినా, సిబ్బంది అవీనీతి వ్యవహారాలకు పాల్పడినా ఫిర్యాదుల పెట్టె ద్వారా వినియోగదారులు వారి యొక్క పూర్తి వివరములతో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సర్వీసు నెంబరు, పేరు, చిరునామా, సంతకము మొదలగు వివరములు లేని ఫిర్యాదులపై ఏ విధమైన చర్య తీసుకొనబడదని తెలిపారు. ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరములు ఫిర్యాదుదారుడు తెలియజేసిన చిరునామా /ఇ-మెయిల్/ఫోన్ నెంబరుకు ఉత్తరము/ఇ-మెయిల్/ ఎస్ ఎం ఎస్ ద్వారా తెలియజేస్తామన్నారు.

ఏపి ఈపిడిసిఎల్ పరిధిలోని ఐదు జిల్లాల్లో గల ఎస్‌ఈ కార్యాలయాల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాలని, బాక్సులపై ఇంగ్లీషు మరియు తెలుగు భాషలలో ఫిర్యాదుల పెట్టెల సమాచారము తెలియజేయాలని అధికారులకు సూచించామని సిఎండి తెలిపారు. ఏపి ఈ పీడిసిఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల వినియోగదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సిఎండి తెలిపారు.

## భాజపా సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశం



విశాఖ సిటీ : శనివారం సాయంత్రం భారతీయ జనతా పార్టీ నగర కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల సన్నాహకానికి సంబంధించి విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, అరకు, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల జోనల్ సమావేశం నిర్వహించబడింది. నగర అధ్యక్షుడు వీ రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా బీజేపీ జాతీయ కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సహ ఇంచార్జి సునీల్ దియోధర్ , జాతీయ మహిళా మోర్చా ఇన్చార్జి పురందేశ్వరి విచ్చేసారు. రాష్ట్ర ఇంచార్జ్ సునీల్ దియోధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీ కూడా ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయాయని రానున్న కాలంలో భారతీయ జనతా పార్టీ మాత్రమే ప్రత్యామ్నాయ పార్టీగా ఎదుగుతుందని, అవినీతి కుల కుటుంబ పార్టీలైన టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్ ఈ రెండిటిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని, ఈ తరుణంలో భారతీయ జనతా పార్టీని ప్రత్యామ్నాయమని రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఆరు జిల్లాల కార్యకర్తలు పనిచేయాలని తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పి వి ఎన్ మాధవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కాశీ విశ్వనాథ రాజు, ఇతర జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## విశాఖలో మరో ఐటీ కంపెనీ

మధురవాడ : ఆనందపురం.. శరవేగంగా ఎదుగుతున్న విశాఖ నగరం అదే రీతులో ఐటీ రంగం అడుగులు వేస్తోంది. ఆనందపురం మండలం గంభీరం ఐటీ సెజ్‌లో నూతంగా ఏర్పాటైన టెక్విస్సేన్ సాఫ్ట్ వేర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను శుక్రవారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి అవంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2009లో ప్రారంభించిన ఈ సంస్థ భారత దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాలకు విస్తరించటంతో పాటు 2,500 మందికి పైగా ఉద్యోగావకాశాలను కల్పించిన టెక్విస్సేన్ యాజమాన్యాన్ని అభినందించారు. టెక్విస్సేన్ సంస్థ అధినేత సెంట మాట్లాడుతూ నిరుద్యోగాన్ని తగ్గించి అర్హులైన యువతకు ఉపాధి కల్పించటానికి తమ వంతు క ృషి తాము చేస్తున్నామని, రానున్న రోజుల్లో ఇంకా అనేక మందికి ఉపాధిని కల్పినిచనున్నామని, అర్హత ఉన్న అభ్యర్థులు తమ వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు, తమకు ఎంతో అండగా నిలిచిన ప్రభుత్వానికి, ప్రభుత్వ కార్యవర్గమునకు ప్రత్యేక క్రుతుజ్ఞతలను తెలియజేసారు, ఈ కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





శనివారం ఉదయం శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు ఆళ్ల నాని గారిని స్థానిక ఆర్ అండ్ బి అతిధి గృహం వద్ద మర్యాద పూర్వకంగా కలసి ఏపీ ఎన్‌జిజిఓఎస్ అసోసియేషన్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం మరియు ఆ శాఖ ఉద్యోగులు ఐ. నారాయణ రావు, సోమేశ్వరావు, కె.వి. నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖల ఉద్యోగుల పలు సమస్యలను మంత్రి ముందు ఉంచగా, ప్రభుత్వం దృష్టిలో పెట్టి పరిష్కరానికి కృషి చేస్తానని ప్రకటించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com